## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

మాకులమ్ము వాడు, మా మతమ్ము ననుచు
మాకు స్నేహితుడని , మమత వీడి
మంచితనము జూచి సంచితముగ నీవు
ఓటు వేయవోయి మేటిగాను

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 55 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | ఆగస్టు 23, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


### పెట్టుబడులకు తెలంగాణా రాష్ట్రాన్ని వేదికగా

# ఎంచుకోండి

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యం
- టెక్నాలజీ నుంచి జీవశాస్త్రాల వరకు..అపార అవకాశాలు
- అభివృద్ధి... జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు విస్తరించాలి
- మంత్రి ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి




**హైదరాబాద్,ఆగస్టు 22 :** తెలంగాణకు రండి... తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి... తెలంగాణలోనే ఆవిష్కరించండి. ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలను ఇక్కడే ఊహిద్దాం... ఇక్కడే ఆవిష్కరిద్దాం... ఇక్కడి నుంచే ప్రపంచానికి అందిద్దాం'అంటూ రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక, సాంకేతిక రంగాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నవకల్పనకు వెన్నుదన్నుగా నిలిచే యువశక్తి, పెట్టుబడులకు వేగంగా స్పందించే పారదర్శక ప్రభుత్వం ఈ నాలుగు బలమైన స్తంభాలపై తెలంగాణ ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వం కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో శనివారం జరిగిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్క్లేవ్-2026'లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యోపన్యాసం చేశారు. ÷లంగాణ అభివృద్ధి ప్రస్థానం కేవలం గణాంకాల్లో కనిపించే ఆర్థిక వృద్ధి మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం, యువతకు ఉపాధి కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, మిగతా2లో...



# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్

- కాంగ్రెస్‌కు నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోం
- హెచ్చరించిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు 22 :**మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై ఇటీవల చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే సుస్మిత వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోమని

మిగతా2లో...



### తెలంగాణలో విద్యా,పరిశోధనలకు

# కేంబ్రిడ్జ్ సహకారం

- యూనివర్సిటీ ప్రతినిధులతో సిఎం రేవంత్ చర్చలు
- హైదరాబాద్‌లో విద్యావ్యవస్థ పటిష్టతకు అంగీకారం

**హైదరాబాద్,ఆగస్టు 22 :** తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధులు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలు, ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా మిగతా2లో...

### దానం నాగేందర్

# అనర్హత పిటిషన్

- తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు



2లో

### ఇందిరమ్మ ఇళ్ల పేరుతో

# ఓట్లు అడగం

- అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు
- హైదరాబాద్ తరహాలో హౌజింగ్ టవర్స్ నిర్మాణం
- నిజామాబాద్ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**నిజామాబాద్,ఆగస్టు 22 :** నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి.. ఆ పేరుతో ఓట్లు అడిగే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో పర్యటించిన మంత్రి.. నగరంలో హౌసింగ్ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. గృహ ప్రవేశం చేసిన మహిళలకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న

మిగతా2లో...

# నిషేధిత జాబితా పేరుతో వేధింపులు

- ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది
- ఉప్పల్ బాధితులతో హరీష్ రావు



2లో

## గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతుస్తుల భవనం

- ఇద్దరు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు



2లో

## పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

- ఆధునికత సాంకేతికతపై ప్రదర్శన




**హైదరాబాద్, 22 :** నగరంలోని నెక్లెస్ రోడ్‌లో పీపుల్స్ ప్లాజా లో పవర్ ఎగ్జిబిషన్-2026 ఘనంగా ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న

మిగతా2లో...

# 75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయం

- ట్రంప్ సర్కార్ నిర్ణయాన్ని కొట్టివేసిన న్యాయస్థానం



**వాషింగ్టన్,ఆగస్టు 22 :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను

మిగతా2లో...

### 22ఏ నిషేధిత భూముల పేరిట

# పెద్దఎత్తున అక్రమాలు

- భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్



2లో

# పెట్టుబడులకు తెలంగాణా రాష్ట్రాన్ని వేదికగా ఎంచుకోండి

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్ తరాలకు సుస్థిరమైన అభివృద్ధి పునాదులు నిర్మించడం తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2025-26లో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో నామమాత్రపు వృద్ధి రేటు 8 శాతంగా ఉండగా, తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత శక్తికి, విస్తరిస్తున్న అవకాశాలకు నిదర్శనమన్నారు. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేస్తూ తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తుల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్?2047' దార్శనిక ప్రణాళిక రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశర చేస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇది కేవలం భారీ ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదని, సంపద సృష్టితోపాటు ఆ సంపద ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత అభివృద్ధిని సాధించాలన్న సంకల్పమని వివరించారు. ఈ లక్ష్యసాధన కోసం రాష్ట్రాన్ని పరస్పరం అనుసంధానమైన మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. టెక్నాలజీ, అత్యున్నత విలువ కలిగిన పరిశ్రమలు, సేవారంగాలకు కేంద్రంగా పట్టణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దే nvF,నగర పరిసర ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలను విస్తరించే ఖజఖీఇ, వ్యవసాయం, ఆహార శుద్ధి, గ్రామీణ పారిశ్రామిక రంగాలకు కొత్త జీవం పోసే ఈ మూడు ప్రాంతాలు తెలంగాణ సమగ్ర ఆర్థిక పురోగతికి పరస్పర పూరక శక్తులుగా నిలుస్తాయని వివరించారు. అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ గీసుకున్న సరిహద్దుల్లో ఆగిపోకూడదు. అది ప్రతి జిల్లాకు చేరాలి...

ప్రతి పట్టణాన్ని తాకాలి... ప్రతి గ్రామంలో కనిపించాలి... ప్రతి తెలంగాణ కుటుంబం జీవితంలో మార్పుగా ప్రతి ఫలించాలి' అని ఉత్తమ్ స్పష్టం చేశారు.

ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం రావాలంటే అవకాశాలు కొద్ది ప్రాంతా లకు, కొద్ది వర్గాలకు పరిమితం కాకుండా రాష్ట్రం నలు మూలలా విస్తరించాలన్నారు. హైదరాబాద్ ఇప్పటికే సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, ఔషధ తయారీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబి లిటీ సెంటర్లకు అంతర్జాతీయ కేంద్రంగా తనదైన ముద్ర వేసిందని మంత్రి పేర్కొన్నారు.

ఈ బలమైన పునాదిపై సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఎలక్ట్రిక్ మొబిలి టీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో అపారమైన పెట్టుబడి అవకాశాలు ఆవిష్కృతమవుతున్నాయని చెప్పారు.

# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. కొండా సుస్మిత లైన్ దాటి ఆరోపణలు చేశారని అన్నారు. అనిరుధ్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి హద్దు మీరలేదని చెప్పారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. కొండా సురేఖ విషయంలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. కొండా సురేఖ వివరణ చదివామని తెలిపారు. కొండా సుస్మిత మాటల వీడియోలను చూశామని చెప్పారు. ముఖ్యమంత్రిపై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. మంత్రి సురేఖ వివరణపై మరోసారి సమావేశం కావాలని భావించామన్నారు. క్రమశిక్షణ కమిటీకి మరి కొందరు ఎమ్మెల్యేలు మరిన్ని వివరాలు ఇస్తామన్నారని చెప్పారు. అలాగే, చిన్నారెడ్డి వివరణ లేఖ చదివామని మల్లు రవి అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యల వీడియోలు చూశామని తెలిపారు. చిన్నారెడ్డి విషయంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డితో మాట్లాడతామని అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలకు, మేఘా రెడ్డి ఫిర్యాదుకు చాలా అంతరం ఉందని చెప్పారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడిన అంశాలు తనకు తెలుసని.. కానీ ఒక ప్రాసెస్ ప్రకారం విచారణ ఉంటుందని మల్లురవి తెలిపారు. ఆయా వ్యక్తులపై తమకు ఎలాంటి అభిప్రాయం ఉండదని చెప్పారు. పార్టీనే తమ మొదటి ప్రాధాన్యం అని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ వివరణ లేఖ తమకు అందిందని మల్లురవి తెలిపారు. తన వ్యాఖ్యలపై కంది శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారని అన్నారు. ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడిని ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేశామని చెప్పారు. కంది శ్రీనివాస్ రెడ్డి అంశాన్ని సైతం మరోసారి కూర్చొని మాట్లాడతామని మల్లురవి పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఓట్లు అడగం

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కొత్త టెక్నాలజీతో ఇందిరమ్మ మోడల్ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలలో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణం చేపడతామని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ గా నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో శ్రీకారం చుట్టామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు 230 రూపాయలకే సిమెంట్ బస్తాఇవ్వడానికి కంపెనీలు ముందుకు వచ్చాయని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు మంతంరి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగింది. పట్టణంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్దిదారులకు మంజూరు అంజేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, మరియు గృహనిర్మాణ అంశాల మీద అధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ షాపింగ్ కాంప్లెక్స్ లో గంగస్థాన్ ఫేజ్ 2 భవనానికి ప్రారంభోత్సవం చేయడం జరిగింది. నిజామాబాద్ జిల్లాలోని వివిధ మండలాలకు మంజూరైన నూతన తహసీల్దార్ కార్యాలయాల భవనాలతో పాటు నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి మరియు గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు భూమి పూజ చేయడం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలో సంవత్సరానికి 2 లక్షల చొప్పున ఇండ్లు కట్టి ఉంటే పదేండ్లలో 20లక్షల ఇండ్లు పూర్తి అయ్యేవి. కేవలం 60 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసింది. 30వేల ఇండ్లను మొండిగోడలతో అసంపూర్తిగా వదిలేసేసింది. నిజామాబాద్ టౌన్ లో కూడ సుమారు 400 ఇండ్లను అసంపూర్తిగా వదిలేస్తే, ప్రజాప్రభుత్వం వచ్చాక వాటికి నిధులు కేటాయించి నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండేలా యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి, డ్రా పద్ధతిలో అర్హులైన పేదలకు ఇండ్లను కేటాయించడం జరిగింది. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ. 3 కోట్ల 72 లక్షల 65 వేల చెక్కు అందజేశాము. రాబోయే 20 రోజుల్లో నిజామాబాద్ టౌన్ లో పైలట్ ప్రాజెక్ట్ కింద హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణాలు శ్రీకారం చుట్టబోతున్నాం. సొంత జాగలేని అర్హులైన నిరుపేదలకు తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని అన్నారు. ఇక సిమెంట్ బస్తా ధర 330 వరకు ఉంది. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి అది భారంగా కాకుడదు అనే ఆలోచనతో ప్రజాప్రభుత్వం సిమెంట్ పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడి, ఒప్పించి 230 రూపాయలకే సిమెంట్ బస్తా అందించేలా ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు.

# 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్దఎత్తున అక్రమాలు

**హైదరాబాద్,ఆగస్టు 22:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా?

ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమిషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమిషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధా నం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మె ల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది.

ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయని కిషన్ రెడ్డి అన్నారు.

# పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రదర్శనలో విద్యుత్ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతల ను ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, వినియోగంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులను ప్రజలకు పరిచయం చేయడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఎగ్జిబిషన్‌లో విద్యుత్ భద్రతా చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.

స్మార్ట్ మీటరింగ్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ వ్యవస్థలు వంటి నూతన సాంకేతికతలపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు.

విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలను ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునేలా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.

# హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో పేలుడు

## - ఇద్దరు కార్మికుల మృతి..క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలింపు

**యాదాద్రి,ఆగస్టు 22 :** యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం శివారులోని హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ భారీ శబ్దంతో పేలింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమా దంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా.. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరా బాద్‌కు తరలించారు.

కంపెనీలోని సి-బ్లాక్‌లో నైట్ షిఫ్ట్‌లో 18 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. రియాక్టర్ వద్ద పనులు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు. పేలుడు ధాటికి పెద్దవూర మండలానికి చెందిన చిన్న నాగిరెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన నాగన్న బోయిన నరేష్‌కుమార్ మృతి చెందారు. రియాక్టర్ సమీపంలో పనిచేస్తున్న మరో పది మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రియాక్టర్ పేలిన శబ్దం భారీగా వినిపించడంతో పరిసర గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక కొందరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో కంపెనీ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ రూరల్ సీఐ సతీష్‌రెడ్డి, ఎస్సై జగన్ పోలీసు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. చౌటుప్పల్, హయత్‌నగర్ నుంచి ్గ÷ర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. హెజో లేబొరేటరీస్‌లో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత జూలై 16న రసాయన వాయువులు పీల్చడంతో అనంతపురం జిల్లా సింగనమల మండలం ఉలికల్లు గ్రామానికి చెందిన ఆలుమూరు కృష్ణారెడ్డి (42) అనే కార్మికుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆ ఘటన జరిగి నెల రోజులు కూడా పూర్తికాకముందే తాజాగా రియాక్టర్ పేలడంతో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం తర్వాత కంపెనీ పరిసరాల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ ఆవరణలో మురుగునీరు చేరి ఉండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ దుర్వాసన కారణంగా కొందరికి తలతిరగడం, వాంతులు వంటి ఇబ్బందులు ఎదురైనట్లు చెబుతున్నారు.

# 75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేయాలని ఈ ఏడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది. ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సులర్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. 75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం. కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారు మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంతవరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది' అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

# గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతుస్తుల భవనం

## - ఇద్దరు మృతి..మరొకరికి తీవ్ర గామాలు

**హైదరాబాద్,ఆగస్టు 22 :** గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్ప కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే, నాలాను ఆనుకుని 50 గజాల్లో అక్రమంగా ఈ భవనాన్ని నిర్మించారు.

ఈ నిర్మాణం కూలిన పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై శకలాలు పడ్డాయి. భయంతో పక్కనే ఉన్న హాస్టల్లోకి విద్యార్థులు పరుగులు తీశారు.ఈ సంఘటన స్థలానికి హైడ్రా, డీఆర్ఎఫ్ టీమ్స్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఈ నిర్మాణానికి సీఎంసీ టౌన్ ఎలానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిం దే. క్షేత్రస్థాయిలో టౌన్ ఎలానింగ్ అధికారులకు ముడుపులిచ్చి ఈ భవనాన్ని యజమాని నిర్మిస్తున్నట్లు సమాచారం. క్రమంగా బిల్డింగ్ నిర్మాణాన్ని ఖాజా అనే వ్యక్తి చేపట్టాడు. అంజయ్య నగర్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో భవనాల నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖాజా నిర్మిస్తున్న అక్రమ భవనంపై పలుమార్లు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. అయిన హైడ్రా, సీఎంసీ సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తెలంగాణలో విద్యా,పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. ముఖ్యంగా విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, అంతర్జాతీయ స్థాయి విద్యా కార్యక్రమాలను హైదరాబాద్‌లో నిర్వహించడం, సంయుక్త పరిశోధనలకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ప్రతినిధులు కేంబ్రిడ్జ్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంబ్రిడ్జ్ ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలు, పరిశ్రమలు, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై కూడా సమావేశంలో వివరించారు. అదేవిధంగా సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలు, స్టార్టప్‌ల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. తెలంగాణ యువతలో ఉన్న ప్రతిభను ప్రపంచస్థాయి వేదికలకు తీసుకెళ్లేందుకు కేంబ్రిడ్జ్ సహకారం అందించడంపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలపై కేంబ్రిడ్జ్ విద్యావేత్తలు సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, భాగస్వామ్యాన్ని ఆచరణలోకి తీసుకురావాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, స్టార్టప్ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# నిషేధిత జాబితా పేరుతో వేధింపులు

**హైదరాబాద్,ఆగస్టు 22 :**నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది 30శాతం కమిషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ం బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందని అన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే.. ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమిషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా కోడై కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22ం భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి మీ సమాధానం ఏంటని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాధితులందరూ అధైర్యపడవద్దు. ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే మీ ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22ం నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# దానం నాగేందర్ అనర్హత పిటిషన్

## - తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

**హైదరాబాద్,ఆగస్టు 22 :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కోర్టుకు వివరించారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు. తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# నీలగిరి - సాహితీ సంగమం-19

## చాటువులు

కం
తప్పెవు డైనను తప్పే
తప్పులు తనవైన నయ్యొ తప్పిద
మనుచున్
తప్పులు వేరెవరి వయిన
గొప్పగ కోపమున బడియు గొడవలు
సేయున్
కం.
పరనింద నాత్మ నుతులును
పరిపరి విధముల్, మదాంధ భావము
తోడన్
గరువపు పలుకులు పలుకుచు
పరులను చినబుచ్చుచుంద్రు పని
గట్టుకొనిన్
కం
పరనింద నాత్మ నుతులును
పరిపరి విధముల్, విబుధుడ వైనను
పెదవిన్
విరువరె యాడంబర మని
పరువును దీయుచు బలుకరె
బహిరంగముగాన్

సత్యనారాయణ బొలిశెట్టి,
హైదరాబాద్

## "దంతములు"

కం.:
లెక్కకు ముప్పది రెండుగ
దిక్కగు 'దంతములు', జనులు తిండి
తినుటకై,
చక్కగ నుండుట వరమై
చిక్కులు పెరుగు మలివయసు క్షీణత తోడై.

కం.:
కతగా సంఖ్యా బలిమియె
గతినీయు మరిన్ని రెట్లు కష్టము లెన్నో,
హితమగుచు దంతవైద్యుల
ప్రతి యొకటిగ దంతములకు వైద్య
చికిత్సన్.

కం.:
దంతముల రక్షణకు తగి
నంతగ ప్రాధాన్యత నిడు యత్నము మేలౌ
వంతుగ శుభ్రత వలయును
నంతంబై వాడుకొనుట హానికరములన్.

వేగరాజు సాయి వర ప్రసాద్,
హైదరాబాదు

## " బాగుంది!" (గజల్ )

ప్రియురాలి కళ్ళలో నావలపు దీపాలు
వెలగడం బాగుంది!

దరిచేరి వడిలోన ఎడతెగని ఊసులను
చెప్పడం బాగుంది!
సద్దుసేయొద్దంటు గాలితో
చేప్పేసి ఎదసడులు వింటాను!
రెప్పేయ వద్దంటు నిలవేయు అందాలు
చూడటం బాగుంది!
కదలకని కాలాన్ని బెదిరించి
నీచెంత నే తిష్ఠ వేశాను!
వదలనని ఒట్టేసి నునుచుట్టు
నీతోడ గడపడం బాగుంది!
కవినైతె నీపైన కమనీయ
కావ్యాలు వ్రాయలేనందువా ?
సిగ్గుతో ఎరుపెక్కు నీబుగ్గ
నిగ్గులను నిమరడం బాగుంది!
కనికట్టు గారడీ కసితోడ చేసేసి కవ్వించు
నెరజాణ!
క్షణమైన నిను వీడి బ్రతకలేనని అంటె
నవ్వడం బాగుంది!

కుసుమ ఉప్పలపాటి హైదరాబాదు.

## అద్దె ఇల్లు (ఆటవెలదులు )

అద్దె ఇంటి లోన నమరునా
సౌఖ్యంబు?
భయము తోడ మనము
బ్రతుకుటెట్లు?
మేకు కొట్టరాదు మేలమాడగ రాదు
చిన్నవాళ్ళు గోల చేయరాదు.
కర్మకాండ చేయు కష్టంబు వచ్చినా
ప్రేతమునట తెచ్చి పెట్టరాదు.
బంధు మిత్రుల గని బావురనేడ్చుచు
వీథి వీథి తిరిగి వెడల వలయు.
నీటి పొదుపు నెపుడు నిష్ఠగా
పాటించి
నద్దె తప్పక నిడి యణుకువ గల
మానవాధములము
మాయనెఱుంగక
జగతి లోన బ్రతుకు సజ్జనులము.
బాడుగ గృహ మందు బ్రతుకంగ
వెఱపుతో
ధనము నిపుడు కొంత దాచి పెట్టి
సొంత యిల్లు కనుల చూచిన
భాగ్యమౌ
జీవితమున మాకు చింత తొలగు
.//

టి. వి. యెల్. గాయత్రి.
పూణే. మహారాష్ట్ర.

## రాఖీ పండుగ

సీసం:
యేడాది కొకరోజు యెల్ల జనులు
యుర్వి
జరుపు కుందురు జూడు
జాతరగను!
యింటింటి పండుగై యిలలోన
వెలసిన
రాఖీలు కట్టేరు రయముగాను!
అన్నయూ తమ్ముడూ
ఆనందముప్పొంగ
అక్కచెల్లెంద్రను ఆదరించి!
పెద్ద రాఖీలను ప్రేమతో కట్టుచూ
మురిసిపోయెదరోయి ముదితలంత!

ఆ. వె:
కులము మతము వీడి కుత్రలను
వదిలి
కూడి వత్తు రోయి కువలయాన!
తరచి చూడగాను ధరణిలోనను
యిట్టి
పర్వ దినము లేదు పరవశించ!

ఎర్రన, తుంగతుర్తి

## "నవబ్రహ్మ గురజాడ"

సీ.శ్రీ.శ్రీ

సన్మార్గమార్పుకై సాహిత్యరోపముల్
సంధించె నవయుగ చక్రవర్తి
యాధునికకవిత నవనీతలంబెల్ల
పట్టంబుకట్టిన పండితుండు
ముత్యాలసరములన్
సత్యాలుజెప్పియు
మూఢత్వ భావనల్ రూఢిమార్చె
నన్యాయమెదిరింప యదుగకన్యాశు
ల్క
మనునాటకమువ్రాసె
నవరధాత

ఆ.వె.శ్రీ.శ్రీ

నవసమాజమున సుకవిగను
గురజాడ
ఖ్యాతిపొందినాడు ఘనముగాను
నాంధ్రమాతబిడ్డ యప్పరావుకెపుడు
నంజలిదుదు జనులు నవనియందు.

రఘుపాత్రుని.సాయిశివ.

## సమస్యా పూరణ/దత్తపది

1 : సింహమును జూచి తరిమెనో
చిన్నవాడు

తేటగీతి :
అమ్మ యిచ్చిన తాయిల మందు
కొనుచు
కొద్ది కొద్దిగ తినుచున్న కొంటె వాడు
దరికి రాగనె కర్రతో దళిపి గ్రామ
సింహమును జూచి తరిమెనో
చిన్నవాడు.

దళిపి = భీతి, భయము.

2 దత్తపది (కందం)
మోసము, పాశము, క్లేశము, నాశము.
కం.
మోసము జేసెడు వారికి
పాశములై తగులుకొనును
బంధములన్నిన్
క్లేశము లైవిల సిల్లుచు
నాశము బొందుట సతము కనం దగు
భువిలో.

పేరి భార్గవి
విశాఖపట్నం

## 1 ఫోను : చరవాణి

ఆ.వె.

ఫోను తోని జనుల ఫోజులు పెక్కులు
భవితమరచి వారి బాట మారె
వావి వరుసలేక వంత పాడుచు ప్రజ
తేటతెల్లమాయె మాట తీరు

2 మానవ పరివర్తన,,,

ఆ.వె.
వావి వరుస మరచి వర్తించు నరులును
చేతి సాయ మంది చెడును సేయు
మరచి పోదురింక మన్నన మరచియు
కలియుగములొ జనుల కరుణ రాదె

శర్వాణి సత్యప్రసాద్ పాతూరి
మైత్రి పరిమళం

## మానవత

తే.గీ.

పాతకుల నెల్ల ప్రేమతో పరిగణించి
యాపదలు పైన బడినంత
నాదుకొనుచు
సాటి వారి కష్టములను చక్కదిద్దు
మానవత పెంచవలయును
మనుజులందు

తే.గీ.

ధనము కలిగున్న లేకున్న ధాత్రి యందు
కులము మతము భేదములను
కూల్చివేసి,
పేర్మి సతతము పంచెడు ప్రేమమూర్తి
మనుజులందున దేవుడై మానితమగు!

తే.గీ.

?నాది నేనను స్వార్థము నాశ పరిచి
సాటి వారికి దయజూపి సాయపడుచు
బాధపడు వారి దుఃఖము బాపినపుడు
మానవత యన్న పరమార్థ
మార్గమమరు!

మరింగంటి శ్రీనివాస్
హైదరాబాదు

## శ్రావణమాసం

ఉ.
భావన లన్నిపావనము ,భవ్యమహత్తర
భాగ్యధమ్ములున్
శ్రీవనితా లలామను ,విశేషముగా
నుతియించు పర్వముల్
సేవిత పాదపద్మయుగ శ్రీమయ దీప్తుల
కాటపట్టునై
శ్రావణమాసమే భువిని చక్కగ నిండెను
లక్ష్మీరూపమై.

శా
.శ్రీలక్ష్మీ
!శ్రితపారిజాత!సుగుణా;శ్రీనాథపత్నీ
!వరా!
లాలిత్యంబున నిన్నుగొల్చివసుధన్
రాజిల్లు నీవిశ్వమే
ధీలాలిత్యమునొప్పచారుమతియున్
తేజస్వినీ!గొల్వగా
మేలౌసంపదలెన్నొ గూర్చి
తివమా!మీనాక్షి!మమ్మేలుమా!

అవధానిని.గాయత్రీదేవి.

## వరలక్ష్మీ వ్రతము

ముంగిటందున ముత్యపు ముగ్గు వేసి/
పసుపు వ్రాసిన గడపతో పద్మ వాసి,/
వరము లిచ్చెడి వరలక్ష్మి, శరణ
మనుచు/
లక్ష్మి పూజ చేదుము రండి లలన లార!
సంపదలను కోరము తల్లి సఖ్యతిమ్ము/
కనక వర్షము వలదు నీ కరుణ జాలు/
భక్తితో మేము కొలిచెద భద్ర తిమ్ము/
వినతి తో వేడు కొందుము విష్ణుప్రియ!
పరము కోరలేదు/
కరము మోడ్చి మేము/
శరణు గోరుచుంటి/
వరము నిమ్ము తల్లి!

వసుమతీ జగన్నాథం.
హైదరాబాద్.

## ఎనుకటి నా పల్లె

ఎనుకటి నా పల్లె కల ఎటువాయే,
చూద్దామంటే కండ్లకు కానరాదాయే!
కాలుష్యం లేని పచ్చని ప్రకృతి పాయే,
స్వార్థం లేని మనిషే కరువైపాయే!

కురిసేటి వానలకు చెరువులు నిండు
కుండలై,
గంతులు వేస్తూ పారెను మత్తడి దుంకి
ఏరులై!
కాలం వచ్చినా వానలు పడకపాయే,
ప్రకృతిని నమ్మిన రైతన్న మోసపాయే!
జోడెడ్లను కట్టి జోరుగ దుక్కి దున్నిరి,
నడుమొంచి నారు తీసి పచ్చని నాటు
వేసిరి!
యాడికి పోయెనొ ఆ ఆట పాటలు,
పాటల్లోనే మరచిరి నాటి కష్టాలు!
ఏ మందూ లేకున్నా పండించిరి
పంటలు,
అంబలి, గడుకే ఆనాటి పరమాన్నము
తాత ముత్తాతల నాటి ఆ ఎముకల
బలము,
లేదాయె చూడు ఈనాటి లోకపు
తరము!
నేడు ఏది తిన్నా సరే ఎల్లెడలా
విషముండు,
ఎప్పుడు చూడు ఒంట్లో ఏదో ఒక
రోగముండు!
ముప్పయ్యేండ్లకే ఒంటికి ముసలితనం
వచ్చెను, నిండు నూరేండ్లు
నిండకుండానే చచ్చెరు!

గాథం అరుణ్ కుమార్, బి.టెక్,
వరంగల్.

## పరశురామావతారము

తే.గీ.
కార్తవీర్యార్జున తతికి కమ్మనైన
భక్ష్యములనందజేయగ పరమప్రీతి
అతిధి సత్కార్యములిడనృపతి యడిగెను
కామధేనువు నధికమౌ కాంక్ష తోడ

తే.గీ. పంచపాది
మౌని వలదనగ, రాజుమాటవినక
గోవునిన్ గొని పోయెను ,కోపమలర
పరశురాముడు వధియించె వారినచట
తండ్రియానతో ఘనక్షేత్ర దర్శనమ్ము
జేయ తరలివెళ్ళెనతడు చింత మరచి

తే.గీ.
తండ్రినిన్ జంపగారాజు తనయులపుడు
భార్గవుడు వేగమేగెనా ప్రాంతమునకు
మట్టు పెట్టగ వారిని ,మరల తనదు
పితను రక్షించె శీఘ్రమే ప్రీతితోడ

మాతా గంగాభవాని శాంకరీ
దేవి,చెన్నై.

## సమస్య పూరణలు

ఉ.మా.
1

అందరు వేచియుండగను నద్భుత
గానము వెల్లువెత్తగన్

డెందము పొంగిపొర్లగను రివ్వున
లేచియు నాలకించుచున్

మందర మాయ లేక యది మానస
పుత్రికదంచు చెప్పగన్
కొందరు కాకియంచు మతికొందరు
కోకిల యంచ్చు బిల్వరే!!

తే!!గీ!!
2

నలుపు రంగును గాంచియు
నలుగురున్న
చోట వాదులాడు కొనుచు ఘాటుగాను
ముక్కు ముఖమును వర్ణించి ముద్దుగాను
కాకియన గొందరయ్యది కేకియనిరి

గడ్డం కృష్ణారెడ్డిం
రేపాల సూర్యాపేట!!

## చిన్ననాటి...

చిన్ననాటి సంభాషణలు తలుచుకుంటే
ఆనందం
చిన్నపాటి అప్పటి వస్తువులు చూస్తూ
ఉంటే సంతోషం

అప్పటి చిలిపి చేష్టలు మననం
చేసుకుంటే తన్మయత్వం
కల్మషం ఎరుగని బాల్య మిత్రులను
ఆలింగనం చేసుకుంటే

మనసు శీతలత్వం
మరపురాని మరువలేని అప్పటి
జ్ఞాపకాల పొరలు

పొంగి పొరలే అలలు
బాల్యమనే వరమాల మెడలో
ఊగిసలాడే
సువర్ణ శోభిత కలలు

శశిశేఖర్ అల్లంకి
ఏలూరు

## బంధములు

కందము:

బంధములందున స్వచ్ఛత
సంధియు సహనము సిరులు!
ప్రసాదములవియే!
గంధము వాత్సల్యమయా!
గంధకములు దుర్గుణములు! కాల్చును
మనలన్.

బావిన యూరెడి నీరము!
చేవయు మనలనె యడుగును
చెరువుకు! మనసుల్
కావే యొకటే రీతిన్!
జీవితమందున యటులనె! చేయరె
సేవల్.
పరులెవ్విధమున నడచిన!
తరచుటదేలన? మనము సదా యొకటే
యౌ
సరళిన నుండక మారుట
విరుచును మననే! సతతము ప్రీతియె
సుధలే.

దుర్గామాధురి
హైదరాబాదు

## శ్రమయేరా మూలధనం(ఇష్టపది)

సృష్టిలో జూడగా సిరిసంపదలు మిన్న!
దృష్టిలేకున్నచో దిగిపోవునవి!సున్న!
కష్టించి పనిచేసి కాపాడరా నీవు!
ఇష్టంగ నార్జించ నిలవేల్పు వవుతావు!
దీపముండంగనే తెచ్చుకోవోయ్ సిరిని!
పాపాలతో వద్దు!పాశంబుగా ఉరిని!

శ్రమ ఫలితమన ధనము!సరియైన సిరి
ధనము!
మాలక్ష్మి దయ ధనము! మాగాణి తరి
ధనము!

వాగ్దేవి కృప ధనము! వారాహి మది
ధనము!
పాలేరు కృషి ధనము!పాడిపంటలు
ధనము!

ఇల్లాలి హృది ధనము!:నీతల్లి యొడి
ధనము!
దుక్కిలోపల ధనము!దున్నునాగలి
ధనము!

ఘర్మ జలమున ధనము!కర్మఫలమున
ధనము!
వరలక్ష్మిఇష్టపది వజ్రంపు టష్టపది

వరలక్ష్మి యనమండ్ర

## "నందము నొందని వారలుందురా!"

ఉత్పలమాల

సందిట నంగరక్షయది చక్కగ నొప్పుచు
నివ్వటిల్లగన్
చిందిలి మ్రోగుచున్ చరణ శింజిత
రావము విస్తరిల్లగన్
కందువ లీలలన్ దనరు గారడి చేష్టలు
హాళి గొల్పగన్
నంద కిశోరునిన్ గనుచు నందము
నొందని వారలుందురా!

శ్రీమతి టి లక్ష్మీకృష్ణ
హైదరాబాద్

## విద్యార్థుల విరాళంతో బాధిత కుటుంబానికి భరోసా



**పెద్దపల్లి, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బసంత్‌నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పింకాశి సతీష్ కుటుంబాన్ని గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ పరామర్శించారు. విద్యార్థుల నుండి సేకరించిన రూ.32,000 విరాళాన్ని ఆయన చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. సతీష్ భార్య, కుమారుడి పరిస్థితి విషమంగా ఉందని, మరిన్ని దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖానాపూర్--బెల్లాల్ రోడ్డు విస్తరణ పనులకు సర్వే నిర్వహణ



**ఖానాపూర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని ఖానాపూర్--బెల్లాల్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శనివారం దిలావర్పూర్ ప్రాంతంలో ఆర్అండ్‌బి అధికారులు సర్వే నిర్వహించారు. రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 20 అడుగుల వెడల్పు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల మల్లేష్, కారోబార్ పోశెట్టి, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమం అవసరం

**ఖానాపూర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమమే మార్గమని ఎస్టీయూటీఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఎస్. భూమన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్ తెలిపారు. వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ను వెంటనే ఏర్పాటు చేసి తగిన ఫిట్‌మెంట్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యాలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులు--ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయాలని, పెండింగ్ జిపిఎఫ్, సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించాలని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఐక్య కార్యాచరణ చేపట్టి న్యాయమైన డిమాండ్లు సాధించేవరకు ఉద్యమం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈనెల 27న జిల్లా కేంద్రంలో జరగనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని వారు ఉద్యోగ సంఘాలను కోరారు.

## డీఏ, పీఆర్సీ బకాయిల పరిష్కారానికి ఉద్యోగుల ఆందోళన



**ఖానాపూర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** టి.జి.ఈ.ఎ.సి నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో ఈ నెల 27న జరగనున్న మహాధర్నా కార్యక్రమానికి సంబంధించి నోటీసు అందజేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న పెండింగ్ డిఏలు, వేతన సవరణ, జిపిఎఫ్, టీఎస్‌జిఎల్ఐ, పెన్షనర్ల గ్రాట్యూటీ, కమ్యూ టేషన్, ఈఎల్, పిఆర్సి బకాయిలు, డిఏ బకా యిలు వంటి పలు ఆర్థిక సమస్యలు పరిష్కారం కానందున ఆందోళనకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం హామీలు ఇచ్చినా అమలు చేయకపోవడం వల్ల విసుగెత్తిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఐక్యంగా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, జూనియర్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, రిటైర్మెంట్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు తీరని లోటు ఎస్.ఎల్. గౌడ్ మృతి



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మానకొండూర్ నియోజకవర్గం మన్నెంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణ గౌడ్ (ఎస్.ఎల్. గౌడ్) గుండెపోటుతో అకాల మృతి చెందారు. శనివారం ఆయన నివాసానికి చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా విశేష సేవలు అందించిన ఎస్.ఎల్. గౌడ్ పార్టీకి నిజమైన సైనికుడని అన్నారు. సహకార సంఘం చైర్మన్‌గా ప్రజలకు సేవలందించిన ఆయన విధేయత ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, గోపు మల్లారెడ్డి, శ్రీనివాసరావు, మామిడాల అనిల్, ఒగ్గు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అనిల్ అంత్యక్రియల్లో భూక్యా జాన్సన్ నాయక్



**ఖానాపూర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నిర్మల్ జిల్లా పెంబి మండల తాటిగూడ గ్రామానికి చెందిన గుగ్లావత్ అనిల్ శుక్రవారం రాత్రి వాంకిడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాదకర ఘటనపై ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ తాటిగూడ గ్రామంలో జరిగిన అంత్యక్రియలకు హాజరై, అనిల్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియ జేసిన ఆయన, వారికి మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పెంబి మం డల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాలుగు రోజులు వర్ష సూచన.. రైతుల్లో పెరిగిన ఆశలు



**ఖానాపూర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శనివారం సాయంత్రం ఖానాపూర్‌లో మోస్తరు వర్షం కురిసింది. గత వారం రోజులుగా వర్షాలు లేక ఎండాకాలం తలపించేలా వాతావరణం వేడిగా ఉండడంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. వేసిన పంటలు ఎండిపోతున్న సమయంలో కురిసిన జల్లులు ఉపశమనం కలిగించాయి. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. రానున్న నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు, ప్రజలు ఆశాజనకంగా ఉన్నారు.

## పారదర్శక పాలన కోసం జెన్ జీ విజిలెన్స్ వాచ్‌డాగ్



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగరపాలక సంస్థలో అవినీతికి అడ్డుకట్ట వేసి పారదర్శక పాలన అందించేందుకు జెన్--జీ విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ప్రకటించారు. యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ నిపుణులతో 40--50 మంది సభ్యులతో ప్రత్యేక బృందం ఏర్పాటవుతుందని తెలిపారు. అభివృద్ధి పనులు, టౌన్‌ప్లానింగ్ వ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా కమిటీ పనిచేస్తుందని ఆయన చెప్పారు. టెండర్లు, నిధుల కేటాయింపు, పనుల నాణ్యత, బిల్లుల చెల్లింపులపై ఆర్టీఐ ద్వారా సమాచారం సేకరించి పరిశీలిస్తామని వెల్లడించారు. కాంప్లెక్సులు, వాణిజ్య భవనాలు, నిర్మాణ అనుమతులు, డివియేషన్లపై కూడా కమిటీ నిఘా పెట్టనుందని తెలిపారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలన్నారు. చైన్‌మెన్‌లు, డ్రైవర్లు, రిటైర్డ్ ఉద్యోగుల పేర్లతో అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, వాటిని కూడా కమిటీ పరిశీలిస్తుందని రాజేందర్‌రావు పేర్కొన్నారు. వాచ్‌డాగ్ సభ్యుల ఫోన్ నంబర్లను ప్రధాన చౌరస్తాల్లో హోర్డింగుల ద్వారా ప్రదర్శిస్తామని, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు .రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాల్లోని 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, త్వరలోనే బాధితులకు న్యాయం జరుగుతుందని రాజేందర్‌రావు భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ పాలన కంటే బీజేపీ పాలనలో అవినీతి ఎక్కువగా ఉందని ఆరోపిస్తూ, ఎవరు అధికారంలో ఉన్నా అవినీతికి కాంగ్రెస్ వ్యతిరేకమేనని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సుస్మిత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కాంగ్రెస్ కార్పొరేటర్లు, సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, 22ఏ భూ బాధితుల ఐక్యవేదిక ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి జయంతి వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రజా బహదూర్ వెంకటరామిరెడ్డి 157వ జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న విగ్రహం వద్ద రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం "వెంకటరామిరెడ్డి అమర్ రహే" అంటూ నినాదాలు చేశారు. సీతరాంపూర్‌లోని ఆర్‌బివిఆర్ఆర్ బి.ఎడ్ కళాశాలలో కూడా ఆచార్యులు, రెడ్డి కులస్తులు కలిసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిజాం కాలంలో కొత్వాల్‌గా పనిచేసిన వెంకటరామిరెడ్డి సేవలకు గుర్తుగా రాజా బహదూర్ బిరుదు లభించిందని, పదవీ విరమణ అనంతరం విద్యార్థుల కోసం హాస్టళ్లు ఏర్పాటు చేసి విద్యా సేవలు అందించారని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి, గొట్టుముక్కుల సమ్మె రెడ్డి, పెండ్యాల కేశవ రెడ్డి, బండ గోపాల్ రెడ్డి, కాసర్ల మధుకర్ రెడ్డి, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, గన్ను మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ భూముల తప్పిదాలపై విచారణ జరుపాలని బీజేపీ డిమాండ్



**జగిత్యాల, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్రవ్యాప్తంగా 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన తప్పిదాలు, అక్రమ చేర్పులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని బీజేపీ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నలువల తిరుపతి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరగంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ తప్పుగా జాబితాలో చేరిన ప్రైవేటు పట్టా భూములపై ప్రత్యేక విచా రణ జరిపి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లాలోని 22ఏ భూముల వివరాలను గ్రామం, మండలం, సర్వే నంబర్ వారీగా బహిర్గతం చేయాలని, ధరణి--భూభారతి రికార్డుల్లో జరిగిన మార్పులపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగా రికార్డులు మార్చిన అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. భూ యజమానుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెస్సల్ వ్యవస్థ ఏర్పాటు చేసి, నిర్ణీత కాలంలో సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి నివేదికను ప్రజలకు వెల్లడించాలని కోరారు. 22ఏ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సుంకేటి దశరథారెడ్డి, కార్యాలయ కార్యదర్శి జంబర్తి దివాకర్, పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, సీనియర్ నాయకులు కస్తూరి సత్యం, రాగిళ్ల సత్యనారాయణ, కాయితి శంకర్, మండల అధ్యక్షులు రాంరెడ్డి, ఇట్నేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలో బీజేపీ విఫలమయింది

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణ అభివృద్ధి దేశ అభివృద్ధికి కీలకమని మంత్రి పొన్నం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ 2047" లక్ష్యంతో ముందుకు వెళ్తోందని, పెట్టుబడులు తీసుకురావడం, అంతర్జాతీయ వేదికల్లో రాష్ట్ర సామర్థ్యాన్ని పరిచయం చేయడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలకు కేంద్రం అనుమతులు నిరాకరించడం బాధాకరమని ఆయన విమర్శించారు. మెట్రో రైలు, ఔటర్ రింగ్ రోడ్లు, రేడియల్ రోడ్ల వంటి ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, మౌలిక వసతుల విషయంలో కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలని, చిన్నచిన్న అంశాలపై ఇబ్బంది పెట్టకుండా సమాఖ్య స్ఫూర్తితో ముందుకు రావాలని ఆయన సూచించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రాన్ని నిలదీయడంలో విఫలమయ్యారని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని మంత్రి పొన్నం అన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధమని, కానీ సహకారం నిరాకరించినప్పుడు తప్పకుండా ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఎదగాలని, ప్రతి వర్గానికి సమగ్ర అభివృద్ధి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటుపరం చేయొద్దని ఎస్ఎఫ్ఐ డిమాండ్





**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జీవో నం. 97ను రద్దు చేసి శక్తి స్కీంను ఉపసంహరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాలో నిరసన దీక్షలు జరిగాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరిగిన దీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటుపరం చేయడం విడ్డూరమని విమర్శించారు. డిప్లమా విద్యార్థులకు బీటెక్‌లో ప్రవేశం పొందే అవకాశాలు శక్తి స్కీం వల్ల దెబ్బతింటాయని హెచ్చరించారు. అదే రోజు బొమ్మకల్ ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జరిగిన నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో పాలిటెక్నిక్ విద్యను విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలన్నారు. విద్యార్థుల సమస్యలపై చిత్తశుద్ధి లేకుండా ముఖ్యమంత్రి విదేశీ పర్యటనల్లో మునిగిపోయారని విమర్శించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేసి, ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ రెండో విడత ప్రక్రియపై ఓటర్లు అవగాహనతో సహకరించాలి

**- అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం: ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**





**దేవరకొండ, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ-2026 (ఎస్ఐఆర్) రెండో విడత ప్రక్రియపై ఓటర్లు పూర్తి అవగాహనతో సహకరించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు. శనివారం దేవరకొండ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారని తెలిపారు. సవరణ ప్రక్రియకు ముందు దేవరకొండ నియోజకవర్గంలో 2,69,098 మంది ఓటర్లు ఉండగా, ఆగస్టు 17న విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో 2,32,283 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. వివిధ కారణాలతో 36,815 మంది ఓటర్లను తొలగించినట్లు తెలిపారు. ఇందులో 7,451 మంది మరణించిన వారు, 7,629 మంది డూప్లికేట్ ఓటర్లు, 395 మంది సంబంధిత చిరునామాల్లో లేని వారు కాగా, 21,313 మంది ఇతర ప్రాంతాలకు మారినట్లు గుర్తించామని చెప్పారు. ప్రస్తుతం 51,427 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. అందులో 4,784 మంది నో మ్యాపింగ్, 46,643 మంది లాజికల్ ఎర్రర్స్ కింద గుర్తించబడినట్లు పేర్కొన్నారు. వీరికి సంబంధించి ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 27 వరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద విచారణలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు లేదా విచారణకు సంబంధించిన సమాచారం తెలిసిన ఓటర్లు తప్పనిసరిగా హాజరై, ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల ధ్రువపత్రాల్లో అందుబాటులో ఉన్న ఆధారాలను సమర్పించాలని సూచించారు. తమ ఓటు హక్కును కాపాడుకోవాలంటే బీఎల్‌వోలు, ఎమ్మార్వోలకు అవసరమైన పత్రాలు అందజేయాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలు నిండినప్పటికీ ఓటరు జాబితాలో పేరు లేని వారు ఫారం-6 ద్వారా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇందుకు సెప్టెంబర్ 16 వరకు అవకాశం ఉందని, అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిశీలన అనంతరం అర్హులైన వారిని తుది జాబితాలో చేర్చనున్నట్లు తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 19న ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

2002 నాటి ఓటరు జాబితా, ప్రస్తుతం ఉన్న జాబితా మధ్య వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో మాత్రమే నోటీసులు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు.

ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, పార్లమెంట్ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీశైలం ముంపు బాధితులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్

**నందికొట్కూరు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శ్రీశైలం ప్రాజెక్టు ముంపు బాధితులకు 98 జీఓ కింద హామీ ఇచ్చిన ఉద్యోగాలను ఇప్పించాలని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. నందికొట్కూరు పట్టణంలో రిలే నిరాహార దీక్షలు 150వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఆయన మద్దతు తెలుపుతూ మాట్లాడుతూ, ముంపు ప్రాంతాల నిర్వాసితులను ప్రభుత్వం గుర్తించకపోవడంతో వారి జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 1986లో టీడీపీ ప్రభుత్వం 98 జీఓ ద్వారా ముంపు కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించిందని, 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం



1651 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని అప్రూవల్ తీసుకువచ్చి, 986 మందికి ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి నంద్యాల జిల్లా ఎమ్మెల్యే, ఎంపీ, టీడీపీ, వైసీపీ నాయకుల ఇళ్లను ముట్టడి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మత్తులు చేయాలని, ముంపు గ్రామాలకు సాగునీరు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జుల గౌరీశ్వర్ నాయుడు, 98 జీఓ రిటైర్డ్ ఉద్యోగి గుంపుల వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

# పాఠశాలలో టాయిలెట్‌ను స్వయంగా శుభ్రం చేసిన మంత్రి జూపల్లి

**– పెంట్లవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ.. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**పెంట్లవెల్లి, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ పనితీరు, ఫైళ్ల పెండింగ్, ప్రజా దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై అధికారులను నిలదీశారు.
ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచి వారిని కార్యాలయాల చుట్టూ తిప్పించడం సరికాదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడం



అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.
తనిఖీ సందర్భంగా కార్యాలయంలోని మరుగుదొడ్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన మంత్రి, అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా స్వయంగా టాయిలెట్‌ను శుభ్రం చేశారు. ఉన్నత హోదాలో ఉన్న మంత్రి స్వయంగా ఈ పని చేయడం అక్కడి అధికారులను, సిబ్బందిని ఆశ్చర్యానికి గురిచేసింది.
అనంతరం పారిశుద్ధ్య నిర్వహణ కోసం అవసరమైన సామగ్రి, టైల్స్ ఏర్పాటుకు తనవంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యాలయ ప్రాంగణంతో పాటు మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు.
ప్రజలకు మెరుగైన సేవలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం కూడా అధికారుల బాధ్యతేనని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో సంక్షేమ పథకాల అమలు మరింత పారదర్శకం: ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అమ్రాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఎంకే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో నూతన సాంకేతికతతో ఈ కార్డులను రూపొందించినట్లు పేర్కొన్నారు.
స్మార్ట్ రేషన్ కార్డులు ఏటీఎం కార్డు తరహాలో ఉండటంతో పాటు అధునాతన క్యూఆర్ కోడ్ వ్యవస్థ, పలు భద్రతా ఫీచర్లతో



రూపొందించబడినట్లు తెలిపారు. పాత రేషన్ కార్డుల స్థానంలో వాటర్‌ప్రూఫ్ స్మార్ట్ కార్డులు అందుబాటులోకి రావడం వల్ల లబ్ధిదారులకు మరింత సౌలభ్యం కలుగుతుందని వివరించారు.
గత ప్రభుత్వ హయాంలో అర్హులైన అనేక కుటుంబాలకు రేషన్ కార్డులు అందలేదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సన్నబియ్యం పథకం ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన బియ్యం అందుతోందని తెలిపారు.
సంక్షేమ పథకాల అమలులో రేషన్ కార్డు కీలక పాత్ర పోషిస్తుందని, కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా అందుతాయని ఎమ్మెల్యే అన్నారు.
ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, వివిధ శాఖల అధికారులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వరిలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించాలి

**– సేంద్రీయ వ్యవసాయం, నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించిన కూనారం శాస్త్రవేత్త సతీష్ చంద్ర**

**ఎలిగేడు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతులు వరి పంటలో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని కూనారం వ్యవసాయ శాస్త్రవేత్త సతీష్ చంద్ర సూచించారు. ఎలిగేడు మండలం ధూళికట్ట రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించిన సేంద్రీయ వ్యవసాయం, నానో ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంటలో కలుపు నివారణ, పురుగుమందుల వినియోగం, ఎరువుల యాజమాన్యం, కాండం తొలిచే పురుగు, సుడిదోమ, బ్యాక్టీరియా ఎండాకు తెగులు, ఉల్లికోడు వంటి సమస్యల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తెగుళ్లు, చీడపీడల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.




నానో యూరియా, నానో డీఏపీ వినియోగం ద్వారా ఎరువుల వ్యయం తగ్గి, అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని సతీష్ చంద్ర తెలిపారు. భూమి ఆరోగ్యం, భూసారాన్ని పరిరక్షించేందుకు ప్రతి రైతు కొంత మేరైనా సేంద్రీయ వ్యవసాయ విధానాలను అనుసరించాలని సూచించారు.
మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం. ఉమాపతి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులు తమ వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ కొమురయ్య, ఏఈఓ నరేష్, రైతులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఆటలు, కళారూపాలు మన సంస్కృతికి ప్రతీకలు: ప్రిన్సిపాల్ బొల్లా స్రవంతి

**– ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా గురుకులంలో వైవిధ్యమైన ప్రదర్శనలు**

**పటాన్‌చెరు, ఆగస్టు 22(నీలగిరి ఎక్స్ ప్రెస్):** పల్లె సంస్కృతి, జానపద కళలు మన సంప్రదాయాలకు మూలస్తంభాలని, వాటిని భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీసీ గురుకుల, మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ బొల్లా స్రవంతి అన్నారు.
పటాన్‌చెరు మండలంలోని చిన్నకంచర్ల గ్రామంలో గల బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా తెలుగు విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, ఆటలు, వినోదాలు, జానపద



కళారూపాలను ప్రతిబింబించేలా వివిధ వేషధారణలతో ఆకట్టుకునే ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ బొల్లా స్రవంతి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు విరివిగా కనిపించిన ఆటలు, పాటలు, జానపద కళలు నేడు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ మూలాలను, సంస్కృతిని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శారీరక, మానసిక వికాసానికి దోహదపడే సంప్రదాయ ఆటలు, వినోదాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆటపాటలు, జానపద కళలు మన సంస్కృతిలో విడదీయరాని భాగమని, వాటిని సంరక్షించడం ద్వారా సంస్కృతి పరిరక్షితమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ అనిల్ కుమార్, రేఖ లక్ష్మి, అధ్యాపకులు దేవయ్య, హుస్సేన్, రాజస్వామి, తెలుగు ఉపాధ్యాయులు దేవులపల్లి రమేశ్, విజయ్ కుమార్, నాగరాజు, నగేష్ పాల్గొన్నారు. విద్యార్థులు సాయికిరణ్, శివసాయిరెడ్డి, మణీత్, దిలీప్, అనిల్, గణేష్, రామ్‌చరణ్, యోగేష్, లక్ష్మణ్, అరవింద్, షాద్రాక్ తదితరులు జానపద ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

# విద్యార్థుల చదువుకు ప్రభుత్వ ప్రోత్సాహం

**– 4వ వార్డులో విద్యార్థులకు యూనిఫాంలు, షూలు, బెల్టుల పంపిణీ**

**ఆమనగల్లు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కౌన్సిలర్ దుడ్డు ఆంజనేయులు యాదవ్ అన్నారు. శనివారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన యూనిఫాంలు, షూలు, బెల్టులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన



విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు, షూలు, బెల్టులు అందించడం వల్ల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలు సమన్వయంతో సహకరించాలని కోరారు. యూనిఫాంలు, షూలు, బెల్టులు అందుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు రేణుక, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెకు ప్రజాపాలన పల్లె పల్లెకు పొన్నం





**హుస్నాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ నియోజకవర్గంలోని 183 గ్రామాల్లో "పల్లె పల్లెకు ప్రజాపాలన -- పల్లె పల్లెకు పొన్నం" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 19 నుంచి ప్రతి రోజు ఒక మండలంలో 5--6 గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో నేరుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అక్కన్నపేట మండలంలోని పెద్దదండ, మోత్కులపల్లి, మంచినీళ్ల బండ, కేశవాపూర్, గొల్లపల్లి, మల్లంపల్లి, చౌటపల్లి గ్రామాల్లో ప్రజల సమస్యలను విని, సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించే చర్యలు తీసుకున్నారు. వ్యవసాయం, ఆయిల్‌పామ్ సాగు, ప్రత్యామ్నాయ పంటలు, ఆరోగ్యం, విద్య, అంగన్‌వాడీ కేంద్రాలు, సోలార్ ప్యానెల్లు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలస్థాయి అధికారులు కూడా సమావేశాల్లో పాల్గొనడం వల్ల విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు వంటి సమస్యలు వెంటనే పరిష్కారం అవుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య దూరం తగ్గించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో రామ్మూర్తి, ఎంఆర్ఓ మధుసూదన్, సర్పంచులు, అధికారులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నూతన పోలీసు సంఘం కార్యవర్గానికి ఘన సన్మానం

**కరీంనగర్ రూరల్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లాలో నూతనంగా ఎన్నికైన పోలీసు సంఘం కార్యవర్గ సభ్యులను రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. పోలీసు సంఘం అధ్యక్షుడు ఏ. సతీష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు



శైలజ, ఎం.డి. అఫ్జల్‌తో పాటు ఇతర సభ్యులు సీఐ నిరంజన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్ రెడ్డి వారిని శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం నూతన సంఘానికి తన పూర్తి సహకారం ఉంటుందని సీఐ హామీ ఇచ్చారు. వైద్య సదుపాయాలు, పిల్లల విద్యా సమస్యలు, ఇతర సంక్షేమ అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. తరువాత రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కూడా నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించి అభినందించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతమైన యూరాలజీ శస్త్రచికిత్సలు




**పెద్దపల్లి, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి జిల్లా చందపల్లి గ్రామానికి చెందిన 59 ఏళ్ల మహిళ మూత్ర విసర్జనలో మంటతో ఆసుపత్రికి చేరగా, ఎడమ కిడ్నీ పనితీరు పూర్తిగా దెబ్బతిన్నట్లు వైద్యులు గుర్తించారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో లెఫ్ట్ నెఫ్రెక్టమీ ద్వారా కిడ్నీని విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం రోగి పరిస్థితి నిలకడగా ఉంది. అలాగే నిమ్మనపల్లి గ్రామానికి చెందిన 46 ఏళ్ల మహిళకు నెల క్రితం కిడ్నీలో రాళ్లు ఉండటంతో డిజే స్టెంట్ అమర్చగా, ఈరోజు స్టెంట్ తొలగింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. ఈ రెండు శస్త్రచికిత్సల్లో యూరాలజి వైద్యుడు సంతోష్ రెడ్డి, జనరల్ సర్జన్ సాయి ప్రసాద్, రాము, అనస్థీషియా వైద్యులు భవాని, స్వాతి, కృష్ణవేణి పాల్గొన్నారు. వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ అభినందించారు. జిల్లా ప్రజలు ఇటువంటి అరుదైన వైద్య సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

# పునఃసర్వే పనులను వేగవంతం చేయాలి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. శ్రీరాములు

**పెద్దపల్లి, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పునఃసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. శ్రీరాములు అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి, సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్ గ్రామాల్లో జరుగుతున్న పునఃసర్వే పనులను ఆయన పరిశీలించారు.



ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను తెలుసుకొని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. భూ వివరాల నమోదులో కచ్చితత్వం, పారదర్శకత పాటించాలని, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా సర్వే అధికారి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే డి. సోమేశ్వర్, పెద్దపల్లి తాసిల్దార్ రాజయ్య, సుల్తానాబాద్ తాసిల్దార్ బషీరుద్దీన్, సర్వేయర్లు పాల్గొన్నారు.

# మెగాస్టార్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వెలిచాల రాజేందర్‌రావు



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు కరీంనగర్‌లో ఘనంగా జరిగాయి. మైత్రి హోటల్‌లో చిరంజీవి యువత తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు కేక్ కట్ చేసి అభిమానులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. చిరంజీవితో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ప్రజారాజ్యం పార్టీలో ఆయనతో కలిసి పనిచేసిన రోజులను స్మరించారు. చిరంజీవి సినీ రం గంలో మరిన్ని విజయాలు సాధించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వే ల్పుల వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అభిమానులు ఐక్యంగా ఉండి సమాజ సేవలో ముం దుం డాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
ఆదివారం, ఆగస్టు 23, 2026



## కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్ష సమావేశం



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోర్టు డ్యూటీ అధికారులతో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమన్లు, వారెంట్ల అమలు, పెండింగ్ ట్రయల్ కేసులు, ఈ--పెట్టీ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పురోగతిపై ఆయన సమగ్రంగా సమీక్షించారు. పరిష్కారమైన కేసుల వివరాలను ఆన్‌లైన్ వ్యవస్థల్లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.వారెంట్ల అమలులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అవగాహన కల్పిస్తూ, నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ ద్వారా సమాచారాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని సూచించారు. రాబోయే లోక్ అదాలత్‌లో పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా కోర్టు డ్యూటీ అధికారులు, దర్యాప్తు అధికారులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు.

## మండల సమాచార హక్కు కమిటీ ప్రధాన కార్యదర్శిగా జాల ప్రశాంత్ నియామకం



**హుస్నాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అక్కన్నపేట మండల సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ప్రధాన కార్యదర్శిగా జాల ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి వేల్పుల మహేందర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు.జాల ప్రశాంత్ నియామకానికి సహకరించిన కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సుర స్రవంతి, జిల్లా అధ్యక్షుడు మూల జితేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి వేల్పుల మహేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కమిటీ ప్రతినిధులు, సభ్యులు ప్రశాంత్‌ను అభినందించారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ఘనంగా జరిగింది. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా, పునరుత్పాదక ఇంధన వనరులు, ఆధునిక సాంకేతికత వంటి అంశాలపై రూపొందించిన నమూనాలను ప్రదర్శించారు.ప్రతి విద్యార్థి తన ప్రాజెక్ట్ ఉపయోగం, పనిచేసే విధానం, సమాజానికి కలిగే ప్రయోజనాలను వివరించి ఆకట్టుకు న్నారు. ప్రధానాచార్యుడు మోర రణధీర్ విద్యా ర్థులను అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత పెంపొ ందిస్తాయని తెలిపారు. అత్యుత్తమ ప్రాజెక్టులు ఈ నెల 23, 24 తేదీల్లో సిద్దిపేటలో జరిగే విభాగ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించబడతాయి.ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, బొద్ల శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులల శ్యామ్
విద్యార్థుల ప్రదర్శనలను సందర్శించి ప్రశంసించారు.

## విహెచ్పీ పట్టణ అధ్యక్షుడిగా వరయోగుల మురళీధర్ స్వామి నియామకం



**హుస్నాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ భార్గవపురం విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడిగా వరయోగుల మురళీధర్ స్వామి ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని విహెచ్పీ జిల్లా సహకార్యదర్శి ఒగ్గోజు వెంకటేశ్వర్లు ప్రకటించారు.మురళీధర్ స్వామి తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, బాధ్యతను న్యాయంగా నిర్వర్తిస్తానని తెలిపారు.ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా గందె చంద్రమౌళి, కొండ్ర రమాదేవి, కార్యదర్శిగా రాధారపు మహేందర్, సహ కార్యదర్శిగా కిషన్ చారి వంశీకృష్ణ, కోశాధికారిగా పరమేశ్వర్, సంఘటన కార్యదర్శిగా అభిలాష్ ఎన్నుకోబడ్డారు.

## రక్తదానం సామాజిక బాధ్యత గాలిపెల్లి కుమార్



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మెగా యూత్ ఫోర్స్ నాయకుడు గాలిపెల్లి కుమార్ హైద్రాబాద్ చిరంజీవి బ్లడ్ బ్యాంకులో 56వ సారి రక్తదానం చేశారు. పద్మభూషణ్ చిరంజీవి జన్మదినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆయన ఈ సేవా కార్యక్రమంలో పాల్గొని అభిమానాన్ని చాటుకున్నారు.రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, అత్యవసర సమయాల్లో ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో తమ సంఘం నిరంతరం శ్రమిస్తోందని కుమార్ తెలిపారు. ఎక్కడ రక్తం అవసరమైనా వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా అఖిల భారత చిరంజీవి అధ్యక్షుడు రవణం స్వామి నాయుడు, తెలంగాణ రాష్ట్ర చిరంజీవి యువత అధ్య క్షుడు వేల్పుల వెంకటేశ్, గోపరాజు శ్రీనివాస్, మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ కసా రాజు, ఉత్తర తెలంగాణ కన్వీనర్ మిడిదొడ్డి కపిల్ మాధవ పాల్గొని గాలిపెల్లి కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## చిరుతల రామాయణం నూతన జిల్లా కార్యవర్గం ఏర్పాటు



**సుల్తానాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** చిరుతల రామాయణం నూతన జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్ గౌడ్ ప్రకటించారు.పెద్దపల్లి జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పొన్నం పరశురాములు, అధ్యక్షుడిగా రాజేశం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పిడుగు శ్రీనివాస్ నియమితులయ్యారు. సుల్తానా బాద్ మండల అధ్యక్షుడిగా గొడుగుల సదానందం బాధ్యతలు స్వీకరించారు.నూతనంగా ఎన్నికైన జిల్లా, మండల కార్యవర్గ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ, సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు కరీంనగర్ కళాభారతి లో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై పుస్తకాలు, బహుమతులను కళాకారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిరంజీవి నటనతో పాటు సామాజిక సేవలోనూ విశేష కృషి చేస్తున్నారని, రాబోయే రోజుల్లో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చిరంజీవి హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్, ఫ్రెండ్స్ కల్చరల్ అకాడమీ, ఏ ఓ జీ బ్యూటీ హబ్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు రోజు మొత్తం సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలతో ఉత్సాహభరితంగా సాగాయి.కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు సొల్లు అజయ్ వర్మ, మిలీనియం శ్రీనివాస్, మిడిదొడ్డి కపిల్ మాధవ్, తంగళ్ళ జంగం, కెమెరామెన్ రవి, కేదార్ నాథ్, అభిమానులు, నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోల్, లైన్ పనులు కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.గోదాం గడ్డ ఫీడర్‌లో దెబ్బతిన్న పోల్ ఎరెక్షన్ పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది. ప్రభావిత ప్రాంతాలు: సప్తగిరి హిల్స్ రోడ్ నెం. 1--4, తాహెరా మసీదు, సంతోషి మాత ఆలయం, శ్రీనగర్, భవానీ, మల్లికార్జున కాలనీలు, జానకి వీధి అపార్ట్‌మెంట్లు, లక్ష్మీ గణపతి కాలనీ. వినియోగదారులు సహకరించాలని ఏడీఈ ఎం. లావణ్య కోరారు.అలాగే 33/11 కేవీ అంబేద్కర్ నగర్ సబ్‌స్టేషన్ నుండి 11 కేవీ అంబేద్కర్ ఫీడర్‌పై కొత్త డీటీఆర్ ఏర్పాటు, కొత్త లైన్ పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ప్రభావిత ప్రాంతాలు: ఎస్టీ కాలనీ, అంబేద్కర్ నగర్, శివాజీ నగర్, కిసాన్ నగర్ (పసుల నారాయణ కాలనీ). వినియోగదారులు సహకరించాలని ఏడీఈ పంజల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## పోలీసు విధుల్లో సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలి సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ శనివారం చొప్పదండి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్, స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు, సిబ్బందికి కేటాయించిన విధులు, బాధ్యతలను తెలుసుకున్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్-2.0లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని ఆదేశించారు.పోలీసులు సాంకేతికత వినియోగంలో భాగంగా సీసీటీఎంఎస్-2.0, ఈ-సమన్లు, ఈసాక్ష్య, సైబర్ క్రైమ్ సాఫ్ట్‌వేర్ తదితర అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి, రోజువారీ విధుల్లో వినియోగించాలని సూచించారు.ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించిన కమిషనర్, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను గమనించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ఎస్సై నరేష్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అమ్రాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఎం.కె. గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు ఏటీఎం కార్డు సైజులో, క్యూఆర్ కోడ్‌తో, వాటర్‌ప్రూఫ్‌గా ఉండి 9 రకాల భద్రతా ఫీచర్లు కలిగి ఉన్నాయని తెలిపారు. గతంలో రేషన్ కార్డుల సమస్యల వల్ల సంక్షేమ పథకాలు ఆగిపోయేవి, కానీ ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి కార్డులు అందజేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీ మేరకు సన్న బియ్యం పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలవుతోందని, ప్రతి పేదవాడు మూడు పూటలా కడుపునిండా అన్నం తింటున్నాడని పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, అధికారులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసులకు రిఫ్లెక్టివ్ బెల్ట్‌ల పంపిణీ



**పెద్దపల్లి, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసుల భద్రత కోసం రిఫ్లెక్టివ్ బెల్ట్‌లు, బాడీ బెల్ట్‌లు పంపిణీ చేశారు.రాత్రి వేళల్లో చౌరస్తాలు, ప్రధాన రహదారులపై విధులు నిర్వహించే సిబ్బంది వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా ఈ పరికరాలు ఉపయోగపడతాయని కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. విధుల నిర్వహణలో సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ట్రాఫిక్ నియంత్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ట్రాఫిక్ పోలీసుల భద్రతతో పాటు వాహనదారులు, ప్రజల రక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సురవరం సుధాకర్ రెడ్డి స్మృతి గీతం ఆవిష్కరణ



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్గొండ మాజీ పార్లమెంటు సభ్యుడు అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన స్మృతి గీతాన్ని కరీంనగర్ జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఎస్.కె. మీరా రచించిన ఈ గీతానికి గడిపె మల్లేష్ సంగీతం సమకూర్చి ఆలపించారు. పాటను సిపిఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను ప్రదర్శించిన సుధాకర్ రెడ్డి ప్రజల సమస్యలపై గళం విప్పి, దేశంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించేవారని, ఆయన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. స్మృతి గీతాన్ని రచించిన మీరా, ఆలపించిన మల్లేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల సమ్మయ్య, సిపిఐ నాయకులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, టేకు మల్ల సమ్మయ్య, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లతో సమ న్యాయం సివిల్ జడ్జి దుర్గం గణేశ్



**సుల్తానాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** లోక్ అదాలత్‌ల ద్వారా ఇరు వర్గాలకు సమ న్యాయం అందుతుందని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ పరస్పర అంగీకారంతో కేసులను సులభంగా పరిష్కరిం చుకోవచ్చని, తీర్పులపై అప్పీలు ఉండవని పేర్కొన్నారు. కక్షిదారులు వ్యయప్రయాసలకు గురికా కుండా రాజీ మార్గంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు అల్లం భాగ్యలక్ష్మి--సత్యనారాయణ దంపతులతో పాటు పలువురిని ఘనంగా సన్మానించారు.ప్రత్యేక లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, భూ తగాదాలు, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పరిష్కరించబడ్డాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోద్నాల రవీందర్, ఏజీపీ దూడం ఆంజనేయులు, మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## అయ్యప్ప దేవాలయానికి అన్నపూర్ణ ఉత్తమ సేవా పురస్కారం



**హైదరాబాద్/సుల్తానాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మహా శాస్త్ర సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాయ గానసభ ఆడిటోరియంలో జరిగిన అన్నపూర్ణ పురస్కార ప్రదా నోత్సవం--2026లో సుల్తానాబాద్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయానికి అన్నపూర్ణ ఉత్తమ సేవా పురస్కారం లభించింది.పందల రాజ వంశీయులు శ్రీశ్రీ రాజ తిరునాళ్ సురేష్ వర్మ రాజా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని కుసుమ ప్రదీప్ తాంత్రి గురుస్వామి స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పురస్కారం అందుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఆలయం అందిస్తున్న సేవలను గుర్తించి ప్రతిష్టాత్మక పురస్కారం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత షూస్ పంపిణీ



**సుల్తానాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఉచిత షూస్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దర్గానగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూస్ అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత పాల్గొని విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. అలాగే 7వ వార్డు పరిధిలోని పాఠశాలల్లో ఊట్ల వరప్రదీప్ విద్యార్థులకు షూస్ అందజేశారు.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## చోరీల కేసును ఛేదించిన కోహెడ పోలీసులు



**హుస్నాబాద్ నియోజకవర్గం, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గత నెల రోజులుగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను కోహెడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.సిద్దిపేట జిల్లా కోహెడ మండలానికి చెందిన పెసరు పరశురాములు, వెంకటేశ్వరపల్లికి చెందిన రేగుల శ్రీనివాస్ రాత్రివేళల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. గుండారెడ్డిపల్లి, బస్వాపూర్, కోహెడ గ్రామాల్లో పలు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.శనివారం ధర్మసాగర్‌పల్లి రోడ్డులోని కోహెడ చెరువు కట్ట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కోహెడ సీఐ కె. శ్రీధర్, ఎస్సై పి. అభిలాష్ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన ఎస్సై అభిలాష్, ఏఎస్సై మొగిలి నాయక్, హెడ్‌కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుళ్లు రవి నాయక్, జీవన్‌లను హుస్నాబాద్ సీఐ అభినందించారు.

## తపస్ సభ్యత్వ అభియాన్‌లో పిఆర్సి డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కరీంనగర్ గ్రామీణ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జడ్పీహెచ్ఎస్ నగునూరులో జరిగింది.జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పిఆర్సిని 53% ఫిట్మెంట్‌తో వెంటనే ప్రకటించాలని, 6 డి.ఏలను విడుదల చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అన్ని పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని, కేజీబీవీ ఉపాధ్యాయినులకు టైమ్ స్కేల్ అమలు చేయాలని, గురుకుల పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర నాగరాజు, ప్రధాన కార్యదర్శి చేరాల వెంకటేశ్వర్లు, జిల్లా మండల బాధ్యులు, ఉపాధ్యాయులు కె యాదయ్య, ఏ శ్రీనివాసరాజు, వి సంజీవ చారి, పి శ్రీనివాస్, జి విజయ్ కుమార్, డి అశోక్, టి మల్లేశం, సిహెచ్ గోపాల చారి, వి రాజేశ్వర్, ఆర్ అనిత, కే సౌజన్య, కే పద్మలత,
కే అర్చన తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడిగా గోలి వినోద్ కుమార్ నియామకం



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అఖిల భారత పద్మశాలి సంఘం అఫీషియల్, ప్రొఫెషనల్స్ విభాగం ఉపాధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన గోలి వినోద్ కుమార్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి ప్రకటించారు. శుక్రవారం ఆయన నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి సంఘం అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. నియామకానికి సహకరించిన సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, ఉద్యోగ విభాగం అధ్యక్షుడు తిరందాస్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమితులవడం పట్ల వాసాల రమేష్, ఇప్పనపల్లి సాంబయ్య, స్వర్గం మల్లేశం, మెతుకుసత్యం, గడ్డం శ్రీరాములు, వోల్లాల కృష్ణహరి, గుడిమల్ల శ్రీకాంత్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# 22ఏ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీజేపీ డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితాలో ప్రైవేట్, పట్టా భూములు చేరడంతో మధ్య తరగతి, పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి రాజు అడిచెర్ల ఆందోళన వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ, నిజమైన పట్టాదారుల హక్కులను దెబ్బతీయడం 22ఏ నిబంధన ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. 2023 డిసెంబర్ నుంచి జరిగిన మార్పులపై పూర్తి స్థాయి ఆడిట్ నిర్వహించి, శ్వేతపత్రం విడుదల చేయాలని, చేర్చిన--తొలగించిన ప్రతి సర్వే నంబర్ వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమి, ప్రైవేట్ భూమి ఒకే సర్వే నంబర్‌లో ఉంటే వేరు చేసి, నిజమైన పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం కల్పించాలని సూచించారు. అధికారుల తప్పిదాల వల్ల నష్టపోయిన భూయజమానులకు బాధ్యత ఎవరిదో ప్రభుత్వం చెప్పాలని, నిర్లక్ష్యం చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల భూముల విషయంలో రాజకీయాలు కాకుండా పారదర్శకత, బాధ్యత, కాలపరిమితితో కూడిన పరిష్కారం చూపాలని రాజు అడిచెర్ల డిమాండ్ చేశారు.

# మానసిక వికలాంగుల పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహణ



**తిమ్మాపూర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రం డైరెక్టర్లు డాక్టర్ హరీష్, జచిన్ విలియమ్స్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మానవ సేవయే మాధవ సేవ అనే సూక్తికి నిదర్శనం ఈ పాఠశాల అని, గత సంవత్సరం 500 మందికి పరీక్షలు చేసి 150 మందికి కంటి అద్దాలు, మందులు అందించగా, 50 మందికి ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. ఈసారి విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు కలిపి 300 మందికి పైగా పరీక్షలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. తిమ్మాపూర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సహకారంతో బీపీ, షుగర్ వంటి ఇతర వైద్య సేవలు కూడా అందించబడ్డాయి. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి షర్మిల, ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌తో కేసులకు త్వరిత పరిష్కారం



**హుస్నాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వచ్చేనెల సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ. ప్రమిద సూచించారు. కోర్టు హాల్లో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించిన సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన, ఎలాంటి ఖర్చు లేకుండా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో హుస్నాబాద్, బెజ్జంకి ఎస్ఐలు పి. లక్ష్మారెడ్డి, తిరుపతి, కోహెడ ఏఎస్ఐ మొగిలి నాయక్, న్యాయవాదులు బాకం సంపత్ కుమార్, కన్నోజు రామకృష్ణ, చిత్తారి హనుమయ్య, జుమ్లాల్ నాయక్, జే. కిరణ్ కుమార్, సుంకే రాజశేఖర్, దీకొండ ప్రవీణ్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ఊళ్లళ్ల పట్నాల్ల ముచ్చట్లు పుస్తకావిష్కరణ



**కరీంనగర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సమైక్య సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రచయిత ఎన్. సంపత్ కుమార్ రచించిన "తెలంగాణ ఊళ్లళ్ల--పట్నాల్ల ముచ్చట్లు" పుస్తకావిష్కరణ కార్యక్రమం జిల్లా పరిషత్ కోటర్స్‌లోని ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పద్మశ్రీ పురస్కార గ్రహీత దూరిశెట్టి రామయ్యకు ఘన సన్మానం చేశారు. సునీల్ రావు మాట్లాడుతూ రచయితలు సమాజానికి పరిశోధనాత్మక పుస్తకాలను అందించడం అభినందనీయం అని, పుస్తకాలను డిజిటల్ రూపంలో కూడా అందుబాటులోకి తేవాలని సూచించారు. నేటి తరం పిల్లలకు సంస్కృతి, భాషా గొప్పతనం తెలియజేయడం రచయితల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి, రచయిత సంపత్ కుమార్, అన్నవరం దేవేందర్, డాక్టర్ బి.వి.ఎన్. స్వామి, మాడిశెట్టి గోపాల్, కె.ఎస్. అనంతాచార్య, దూరిశెట్టి రామయ్య, కాండ్లూరి వెంకటేశ్వర్లు, పరశురామారావు, గజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమసమాజ స్థాపన కోసం జీవితాంతం పోరాడిన మహానేత సురవరం సుధాకర్ రెడ్డి



**అచ్చంపేట, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుల, మత, వర్గ వివక్షలు లేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి అని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మారేడు శివశంకర్ పేర్కొన్నారు. అచ్చంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ అచ్చంపేట తాలూకా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా మారేడు శివశంకర్ మాట్లాడుతూ, సమాజంలో డబ్బు, కులం, మతం వంటి అంశాలు ప్రజలను విడదీయడానికి కాకుండా ఏకం చేయడానికి ఉపయోగపడాలనే గొప్ప భావజాలంతో సురవరం సుధాకర్ రెడ్డి పనిచేశారని అన్నారు. అగ్రకులంలో జన్మించినప్పటికీ పీడిత, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన ప్రజానాయకుడిగా ఆయనను కొనియాడారు. భారతదేశంతో పాటు అనేక దేశాలను సందర్శించిన అనుభవం ఉన్నప్పటికీ, సురవరం సుధాకర్ రెడ్డిలో అహంకారం, అసహనం కనిపించేవి కావని, ప్రతి మనిషిని సమానంగా చూసిన అరుదైన నాయకుడని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఈ ప్రాంతంలో కరువు తీవ్రంగా ఉన్న సమయంలో రైతుల సమస్యలపై పోరాడి, ఆకలి బాధితుల కోసం అంబలి కేంద్రాలు నిర్వహించారని గుర్తు చేశారు. కృష్ణా జలాలను వినియోగించుకుని పాలమూరు ప్రాంత అభివృద్ధి కోసం పలు పాదయాత్రలు నిర్వహించి ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు.
భౌతికంగా సురవరం సుధాకర్ రెడ్డి మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి తమకు మార్గదర్శకంగా నిలుస్తాయని, ఆయన కలలు కన్న సమసమాజ స్థాపన కోసం చివరి వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మాడుగుల నరసింహ, సీపీఐ నాయకులు ఎండి బషీర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోరేటి నరేష్, జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్‌కుమార్, నర్రా తిరుపతమ్మ, ఎండీ సయ్యద్, అలివేల, చిట్టెమ్మ, నిరంజనమ్మ, ఫన్నీ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# సన్న వడ్లకు రూ.500 బోనస్

**- సెప్టెంబర్ 10లోగా పంట నమోదు తప్పనిసరి**



**ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సన్న వరి సాగును ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పెద్ది శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ప్రభుత్వం గుర్తించిన ఏడు ప్రాధాన్యత సన్న వరి రకాలను సాగు చేసిన రైతులు బోనస్ పొందేందుకు సెప్టెంబర్ 10, 2026లోగా తప్పనిసరిగా తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ సోనా, సాంబా మసూరి, కేఎన్ఎం 1638, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 రకాల సన్న వరి సాగు చేసిన రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ల వద్ద ఆన్‌లైన్‌లో పంట వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు లేదా ఇతర రైతుల నుంచి విత్తనాలు పొందిన వారు, స్వయంగా సన్న రకాల విత్తనాలను సాగు చేసిన రైతులు సంబంధిత ఏఈవోలను సంప్రదించి నమోదు చేసుకోవచ్చన్నారు. నిర్ణీత గడువులోగా నమోదు చేసుకున్న రైతుల వివరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, ధాన్యం కొనుగోలు సమయంలో క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని వివరించారు. సెప్టెంబర్ 10లోగా నమోదు చేసుకోని రైతులకు రూ.500 బోనస్ వర్తించదని పెద్ది శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఆమనగల్లు మండలంలోని అర్హులైన సన్న వరి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

# నేడు కట్ట మైసమ్మ తల్లి ద్వితీయ వార్షికోత్సవం

**- ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బోనాలు.. భక్తులకు అన్నప్రసాద వితరణ**



**ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని సూరసముద్రం చెరువు కట్ట వద్ద కొలువుదీరిన శ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు నేడు (ఆదివారం) భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నారు. వార్షికోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను సద్గురు శాంకరి అఘోరి మాతతో పాటు దేవాలయ కమిటీ చైర్మన్, 14వ వార్డు కౌన్సిలర్ మొక్తల వెంకటయ్య ముదిరాజ్, కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ శనివారం పరిశీలించారు. కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, బోనాల సమర్పణ, గణపతి పూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమై, 6 గంటలకు పంచామృతాభిషేకం, 7 గంటలకు ప్రత్యేక పూజలు, 7.30 గంటలకు కంకణధారణ, 8 గంటలకు గణపతి పూజ జరగనున్నాయి. అనంతరం ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, 12.30 గంటలకు తీర్థప్రసాద వితరణ, ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. ఆమనగల్లు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కట్ట మైసమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని నిర్వాహకులు కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, అన్నప్రసాదం, ఇతర సౌకర్యాలతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# ఆమనగల్లు ఆస్పత్రి పనులు పరుగులు

**- రూ.17.5 కోట్లతో కొత్త భవనం.. నవంబర్‌లో వైద్య సేవలకు సిద్ధం**



**ఆమనగల్లు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. రూ.17.5 కోట్లతో చేపట్టిన మూడు అంతస్తుల భవనాన్ని నవంబర్ నాటికి పూర్తి చేసి వైద్య సేవలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన పాత ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో నూతన భవనం నిర్మించాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. 2023 ఆగస్టు 18న వైద్య విధాన పరిషత్ ద్వారా రూ.17.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. నిధుల విడుదలలో జాప్యంతో పనులు ఆలస్యమైనప్పటికీ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో నిధులు విడుదలై 2024 జూలై 10న నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 45 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులతో నిర్మిస్తున్న భవనంలో ప్రస్తుతం మొదటి అంతస్తు పనులు పూర్తికాగా, రెండో అంతస్తు పనులు కొనసాగుతున్నాయి. ఈఈ రామ్మోహన్‌రెడ్డి, డీఈ కోటయ్య పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. భవన నిర్మాణానికి రూ.12 కోట్లు, వైద్య పరికరాలు, సామగ్రికి రూ.5.5 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే ఆమనగల్లు, పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు ఆధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి.

# ఆటో కార్మికుల నిరవధిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు

**- డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటానికి అండగా ఉంటాం: దండెంపల్లి సత్తయ్య**



**నల్లగొండ, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ యాప్ ఆధారిత సంఘాల జేఏసీ పిలుపు మేరకు ఆగస్టు 24 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది.
శనివారం నల్లగొండలోని సుందరయ్య భవన్‌లో ఆటో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ, ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలను అప్పగించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని, ఆటో, రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఓలా, ఉబెర్, ర్యాపిడో వంటి యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేసి ఆటో కార్మికుల ఉపాధిని రక్షించాలని సూచించారు.
అలాగే టూ వీలర్ టాక్సీలను నిషేధించాలని, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని, డ్రైవింగ్ లైసెన్సుల జారీ ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సారథి-పరివాహన్ విధానంలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వం వెంటనే ఆటో కార్మిక సంఘాలతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు అద్దంకి నరసింహ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బొమ్మిడి నగేష్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కలగొని యాదయ్య గౌడ్, ఐఎన్‌టీయూసీ నాయకులు తాడేపల్లి దశరథ, భాషాపాక యాదయ్య, చాగంటి రాములు, గుంటూరు సైదులు, హనుమంతు నాయక్, రావుల వీరేశం, దాసరి నర్సింగ్ యాదవ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక

## మహిళా సమాఖ్య భవనంలో శక్తి యాప్ అవగాహన కార్యక్రమం నిర్వహణ



పాములపాడు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ ఆర్. రామాంజి నాయక్ ఉత్తర్వుల ప్రకారం, ఆత్మకూరు రూరల్ సీఐ ఎం. సురేష్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో శక్తి యాప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ధనలక్ష్మి మండల మహిళా సమాఖ్య భవనంలో ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, ఉమెన్ హోమ్ గార్డ్ సుశీల మహిళా లీడర్లకు శక్తి యాప్ వినియోగంపై వివరించారు. శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలియజేస్తూ, మహిళల రక్షణకు పోక్సో చట్టం, బాల్యవివాహాల నివారణ, చిన్నారులపై నేరాల నిరోధంపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 100, 1098, సైబర్ క్రైమ్ కోసం 1930, మహిళా సహాయం కోసం 181 నంబర్లను వినియోగించాలని సూచించారు. ఫేక్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. అదనంగా, మైనర్ విద్యార్థులు మోటార్ సైకిళ్లు నడప రాదని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఉల్లంఘన చేస్తే రూ.10 వేల జరిమానా లేదా జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకెపి (వెలుగు) సీసీలు, బుక్ కీపర్లు, మండలంలోని పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించిన పోలీసులు



నందికొట్కూరు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచనలతో నందికొట్కూరు టౌన్ సీఐ అశోక్ కుమార్, ఎస్సై చంద్రశేఖర్ పర్యవేక్షణలో శక్తి యాప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నందికొట్కూరు ఆర్.ఆర్. హోమ్స్‌లో మహిళలు, ప్రజలతో సమావేశమైన శక్తి టీం ఏఎస్ఐ ఎస్. ఖాదర్ బాషా, పీసీ రసూల్ శక్తి యాప్ వినియోగం, వాట్సాప్ నంబర్ 7993485111, అత్యవసర నంబర్లు 112, 100, 181, 1098, 1930 ప్రాముఖ్యతపై వివరించారు. పిల్లల భద్రత, అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, శక్తి యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. మైనర్ విద్యార్థులు మోటార్ సైకిళ్లు నడపరాదని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ఉల్లంఘన చేస్తే రూ.10 వేల జరిమానా లేదా జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకెపి (వెలుగు) సీసీలు, బుక్ కీపర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పాత్రికేయులకు ఉచిత హెల్మెట్ల పంపిణీ



మర్రిగూడ, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మర్రిగూడ మండల కేంద్రంలోని భారత్ గార్డెన్‌లో ఎల్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా పాత్రికేయులను శాలువాలతో సత్కరించి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎల్వీ ఫౌండేషన్ సభ్యుడు అయితగోని నరసింహ మాట్లాడుతూ, సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారని కొనియాడారు. వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని హెల్మెట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు, ఎల్వీ ఫౌండేషన్ కమిటీ సభ్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి పెరుమాండ్ల ఆంజనేయస్వామి ఆలయంలో అన్నప్రసాదం పంపిణీ

**– ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రొద్దుటూరి రవీందర్ గుప్త**



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): యాచారం మండలం నక్కర్త మేడిపల్లి గ్రామ శివారులోని పెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం పీఆర్జీ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం తన తండ్రి ప్రొద్దుటూరి వెంకన్న గుప్త జ్ఞాపకార్థం అన్నప్రసాద కార్యక్రమం చేపట్టినట్లు రవీందర్ గుప్త తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని ఆంజనేయస్వామిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అలాగే పెరుమాండ్ల ఆంజనేయస్వామి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు బొగ్గుల పాపిరెడ్డి, బీజేపీ నాయకులు కునిరెడ్డి అచ్చిరెడ్డి, మోటె నరసింహం, కడ్తాల్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీను నాయక్, పలేచెల్కతండ మాజీ సర్పంచ్ లోక్య నాయక్, మాజీ ఉప సర్పంచ్ సీతారాం నాయక్, నవీన్ నాయక్, మోతీలాల్, రాజు నాయక్, పాండు నాయక్ (జేసీపీ), బాపూజీ, నారియా నాయక్, గోపాల్ నాయక్, బాదు బావోజి, తపాస్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి పెరుమాండ్ల ఆంజనేయస్వామి ఆలయంలో అన్నప్రసాదం పంపిణీ

– ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రొద్దుటూరి రవీందర్ గుప్త



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): యాచారం మండలం నక్కర్త మేడిపల్లి గ్రామ శివారులోని పెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం పీఆర్జీ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం తన తండ్రి ప్రొద్దుటూరి వెంకన్న గుప్త జ్ఞాపకార్థం అన్నప్రసాద కార్యక్రమం చేపట్టినట్లు రవీందర్ గుప్త తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని ఆంజనేయస్వామిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అలాగే పెరుమాండ్ల ఆంజనేయస్వామి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు బొగ్గుల పాపిరెడ్డి, బీజేపీ నాయకులు కునిరెడ్డి అచ్చిరెడ్డి, మోటె నరసింహం, కడ్తాల్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీను నాయక్, పలేచెల్కతండ మాజీ సర్పంచ్ లోక్య నాయక్, మాజీ ఉప సర్పంచ్ సీతారాం నాయక్, నవీన్ నాయక్, మోతీలాల్, రాజు నాయక్, పాండు నాయక్ (జేసీపీ), బాపూజీ, నారియా నాయక్, గోపాల్ నాయక్, బాదు బావోజి, తపాస్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు నోటీసుల పంపిణీ

**– గుర్తింపు పత్రాలు సమర్పించాలని అధికారుల సూచన**



వంగూర్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా వంగూరు మండల కేంద్రంలో శనివారం రెవెన్యూ అధికారులు ఓటర్లకు నోటీసులు పంపిణీ చేశారు.
ఓటరు జాబితాలో కొందరి వివరాలు, పేర్ల నమోదులో వ్యత్యాసాలు గుర్తించడంతో సంబంధిత ఓటర్లకు నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ప్రభుత్వం గుర్తించిన గుర్తింపు పత్రాలలో ఏవైనా రెండు పత్రాల జిరాక్స్ ప్రతులను సంబంధిత బీఎల్‌వోలకు (బూత్ లెవల్ ఆఫీసర్) తప్పనిసరిగా సమర్పించాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ మురళీమోహన్ మాట్లాడుతూ, ఓటరు జాబితా వివరాల ధృవీకరణ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. నోటీసులు అందుకున్న వారు అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించకపోతే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు వారి ఓటు నమోదు తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి ఆందోళన చెందకుండా నిర్దేశిత గడువులోపు గుర్తింపు పత్రాలు సమర్పించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్, జీపీఓ మల్లేశ్, బీఎల్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల బీఎల్ఏలు పాల్గొన్నారు.

## చిరంజీవి జన్మదినం సందర్భంగా రక్తదానం చేసిన ఉజ్వల ఫౌండేషన్ చైర్మన్ బండ జగన్



హైదరాబాద్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రముఖ సినీనటుడు, పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని ఉజ్వల ఫౌండేషన్ చైర్మన్ బండ జగన్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బండ జగన్ మాట్లాడుతూ, మెగాస్టార్ చిరంజీవి జన్మదినం రోజున తొలిసారిగా రక్తదానం చేయడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. చిరంజీవి సేవా కార్యక్రమాల నుంచి ప్రేరణ పొందిన తాను సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పించుకున్నానని తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా ఉజ్వల ఫౌండేషన్‌ను స్థాపించి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని, యువత కూడా ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మెగాస్టార్ చిరంజీవి సేవా స్ఫూర్తితో ముందుకు సాగుతూ మరింత మంది అవసరమైన వారికి అండగా నిలవడమే తమ లక్ష్యమని బండ జగన్ తెలిపారు.

## బంగారు మైసమ్మ తల్లి కరుణతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: దానగాళ్ల యాదగిరి



బోడుప్పల్, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బోడుప్పల్‌లో నిర్వహించనున్న శ్రీ శ్రీ శ్రీ బంగారు మైసమ్మ బోనాల మహోత్సవాల సందర్భంగా రాజీవ్‌నగర్ కాలనీ డబుల్ బెడ్‌రూమ్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో బోనాల పండుగ శుభాకాంక్షల పోస్టర్‌ను బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దానగాళ్ల యాదగిరి ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ బంగారు మైసమ్మ తల్లి కరుణా కటాక్షాలు ఉంటే సకల శుభాలు చేకూరుతాయని అన్నారు. భక్తుల కోరికలను తీర్చే దయామయి దేవతగా బంగారు మైసమ్మ అమ్మవారు ప్రసిద్ధి చెందినారని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరిపై అమ్మవారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని, కుటుంబాల్లో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూమ్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి తుక్కోజీ అమరేందర్, కోశాధికారి రాజగోపాల్ నాయుడు, ముఖ్య సలహాదారులు గుండ్ల కుమారస్వామి, గోరిగే సంతోష్, ఇదుల వెంకటేష్, పులి రవి తదితరులు పాల్గొన్నారు.

## కోదండ రామాలయంలో శ్రావణమాస భక్తుల సందడి



**– ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాల పంపిణీ**

ఎలిగేడు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గరిమెళ్ల వెంకటేశ్వర్లు వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ప్రసాద దాతలుగా బుర్ర రాజు, మల్లీశ్వరి వ్యవహరించి భక్తులకు ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో మహిళలు, యువత, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత్రికేయ కుటుంబంలో వివాహ వేడుక తరలివచ్చిన జర్నలిస్టులు



కొత్తపల్లె, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కొత్తపల్లె మండలంలోని శివపురం గ్రామంలో పాత్రికేయుడు వి. వెంకట శివుడు కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు నియోజకవర్గం పాత్రికేయులు, జిల్లా సోషల్ మీడియా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా ప్రతినిధులు సయ్యద్ షర్ఫుద్దీన్ అలీ, భావన వినోద్ కుమార్, పాత్రికేయులు కలబండి మోషే, బి. స్వాములు, జి. ప్రవీణ్ కుమార్, కలబండి అంకన్న, దక్క శ్రీకాంత్, సోషల్ వర్కర్ నాగరాజు, రజక సంఘం జిల్లా నాయకుడు సి. ధర్మయ్య, అలాగే మిట్టకందాల గ్రామస్థులు మోపూరి వెంకటేశ్వర్లు, గౌండ మద్దిలేటి, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలి జడ్జి ఏ. శోభారాణి



నందికొట్కూరు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి ఏ. శోభారాణి, జూనియర్ సివిల్ జడ్జి వి. దివ్యలు సూచించారు. స్థానిక కోర్టు ఆవరణంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించిన సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ, రాజీ అయ్యే సివిల్, క్రిమినల్ కేసుల్లో ఇరుపక్షాలకు అవగాహన కల్పించి, ప్రత్యేక బెంచుల ద్వారా పరిష్కారం కల్పించనున్నట్లు తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని, ఇందుకోసం కౌన్సిలింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. చిన్న చిన్న విభేదాలు తలెత్తినప్పుడు ప్రజా న్యాయ పీఠం ద్వారా ముందస్తు సమాచారం ఇవ్వడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మధ్యవర్తిత్వం 3.0 అమలులో ఉందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జిలు సూచించారు. సమావేశంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## నూతన బోరును ప్రారంభించిన ఎమ్మెల్యే గిత్త



నందికొట్కూరు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య కొత్త బోరును ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించేందుకు రూ.3 లక్షలతో బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గ్రామపంచాయతీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పగిడ్యాల మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత ఎమ్మెల్యే గిత్త



నందికొట్కూరు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పర్యావరణ పరిరక్షణతోనే స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. పగిడ్యాల మండలం నెహ్రూ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. పచ్చదనం పరిరక్షణ, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ సుభాన్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలుష్యరహిత వినాయక చవితికి ప్రజలు సహకరించాలి కలెక్టర్ రాజ కుమారి గణియా



నంద్యాల, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : వినాయక చవితి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి ప్రారంభం కానున్న నేపథ్యంలో నిమజ్జన తేదీలను ముందుగానే ఖరారు చేసి, అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే 2,500 మట్టి విగ్రహాలను పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. నిమజ్జన కేంద్రాల్లో లైటింగ్, పారిశుధ్యం, తాగునీరు, ఫైర్ సేఫ్టీ, అత్యవసర సేవలు, ఈతగాళ్లు, పడవలు, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఊరేగింపు మార్గాల్లో రహదారి మరమ్మత్తులు, ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికలు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, సీసీ కెమెరాల ద్వారా నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ప్రజల సహకారం, శాఖల సమన్వయంతో ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ కలిసి కాలుష్యరహిత వినాయక చవితి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## మిలాద్ పర్వదినం సందర్భంగా మెగా మెడికల్ క్యాంప్



పెద్దపల్లి, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మర్కజ్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. స్థానిక ఎంబి గార్డెన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఈ శిబిరానికి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, గంట రాములు, సీఐ, ఎస్సైలు, కమిటీ అధ్యక్షుడు రఫీ ఉల్లా ఖాన్, సయ్యద్ సలావుద్దీన్, సయ్యద్ మసరత్, మొహమ్మద్ నిజభవద్దీన్, ఇమ్రాన్, సయ్యద్ మజీద్, జామ మజీద్, ఇమామ్ మొహమ్మద్ అజీముద్దీన్ తదితరులు హాజరయ్యారు. కమిటీ పెద్దలు, సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కడ్తాల్‌కు 30 పడకల ఆసుపత్రి కావాలి

**– మంత్రి దామోదర రాజనర్సింహకు కాంగ్రెస్ నేత పోతుగంటి అశోక్ వినతి**



**ఆమనగల్లు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు శనివారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసిన అశోక్.. కడ్తాల్ మండల ప్రజల వైద్య అవసరాలను వివరించారు. మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తే కడ్తాల్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని కోరారు. కడ్తాల్ ప్రజల చిరకాల వైద్య అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అశోక్ పేర్కొన్నారు. ఆసుపత్రి ఏర్పాటుకు మంత్రి సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చిరంజీవి పుట్టినరోజుకు అభిమానుల సందడి

**– కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి ఘన సంబరాలు**



**ఆమనగల్లు, ఆగస్టు 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు బికుమాండ్ల నర్సింహా, గిరి యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి మెగాస్టార్ చిరంజీవికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానుల ఆనందోత్సాహాల మధ్య బాణాసంచా పేల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. తెలుగు సినీ రంగంలో చిరంజీవి తనదైన నటన, నృత్యంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారని పలువురు పేర్కొన్నారు. సినీ రంగంతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా కూడా ఆయన ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. అభిమానుల కేరింతలు, జై చిరంజీవి నినాదాలతో వేడుక ప్రాంగణం మార్మోగింది. చిరంజీవి మరిన్ని విజయాలు సాధిస్తూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని అభిమానులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంకం సత్యం, చందు నాయక్, హరి, నాజర్, రఫీ, మహేష్, నరేష్, మహేందర్, గోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ అవార్డు అందుకున్న ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్



**నల్లగొండ, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ది హాన్స్ ఇండియా ఫోటో జర్నలిస్ట్ ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర స్థాయి ఫోటోగ్రఫీ అవార్డును అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ కనబరిచినందుకు ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇండియా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జాతీయ స్థాయి మీడియా సంస్థల ఎడిటర్ల సమక్షంలో శ్రీనివాస్ గౌడ్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సహచర జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు, మిత్రులు శ్రీనివాస్ గౌడ్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# ఉత్తమ గురు పురస్కారం అందుకున్న నల్లగొండ గురుస్వామి కలిశాన్ అశోక్



**నల్లగొండ, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండకు చెందిన ప్రముఖ అయ్యప్ప దేవాలయ గురుస్వామి కలిశాన్ అశోక్ ప్రతిష్ఠాత్మకమైన ఉత్తమ గురు పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పందల రాజ వంశీకులు సురేష్ వర్మ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. అయ్యప్ప స్వామి భక్తి, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తూ, గురుస్వామిగా భక్తులకు మార్గనిర్దేశం చేస్తున్న కలిశాన్ అశోక్ సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. నాలుగు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన గురుస్వాముల్లో నల్లగొండకు చెందిన కలిశాన్ అశోక్ ఎంపిక కావడం విశేషమని అయ్యప్ప భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఆయనకు లభించిన ఈ గౌరవం నల్లగొండ జిల్లాకే గర్వకారణమని పేర్కొన్నారు. అయ్యప్ప భక్తి ప్రచారం, సేవా కార్యక్రమాల్లో నిరంతరం ముందుండే కలిశాన్ అశోక్ గురుస్వామికి ఈ అవార్డు లభించడం ఆయన సేవలకు దక్కిన గుర్తింపని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు, శ్రేయోభిలాషులు, ఆధ్యాత్మిక ప్రముఖులు కలిశాన్ అశోక్ గురుస్వామికి అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

# అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



**కల్వకుర్తి, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం (బీఎఫ్ఎస్ఐ)-- బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ కోర్సులో అతిథి అధ్యాపక పోస్టు కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శార్వాణి తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సులో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 23న మధ్యాహ్నం 2 గంటలలోపు కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమర్పించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులకు డెమో, ఇంటర్వ్యూలు ఆగస్టు 24న నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

# రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి సేవలు చిరస్మరణీయం



**నల్లగొండ, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి 157వ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న రెడ్డి హాస్టల్ వద్ద ఆయన విగ్రహానికి నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి సమాజ అభ్యున్నతితో పాటు విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మి, భావితరాల భవిష్యత్‌కు బాటలు వేసిన ఆయన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. రాజ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకుని విద్య, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఎప్పటికీ స్మరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు వీరవోలు గోపాల్ రెడ్డి, కార్యదర్శి ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ వల్లపు రెడ్డి కోటిరెడ్డి, యాపాల సత్యనారాయణ రెడ్డి, కర్నాటి కరుణాకర్ రెడ్డి, యారాల ప్రభాకర్ రెడ్డి, పుట్ట కృష్ణ సుధాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, గోలి అమరేందర్ రెడ్డి, కట్టా వెంకట్ రెడ్డి, మా రెడ్డి అంజిరెడ్డి, అలుగుబెల్లి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాచ్య తండాలో ఘనంగా మండల పూజలు



**దామరచర్ల, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దామరచర్ల మండలం వాచ్య తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మండల పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావుకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో వాచ్య తండా గ్రామ ప్రజలతో పాటు మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలు, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంగోతు హథీరామ్ నాయక్, లావూరి మేగ్యా నాయక్, సోము సైదీ రెడ్డి, లావూరి శ్రీను నాయక్‌తో పాటు గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# వృద్ధులకు అండగా నిలవాలి

**– చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. మధుసూదన్‌రావు**



**కల్వకుర్తి, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వృద్ధాప్య దశలో ఉన్న వారికి ఆత్మీయత, భరోసా ఎంతో అవసరమని, వారు ఎదుర్కొనే ఎలాంటి సమస్యలకైనా న్యాయ సేవా సంస్థ అండగా నిలుస్తుందని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. మధుసూదన్‌రావు అన్నారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో శనివారం కల్వకుర్తి పట్టణంలోని డీడబ్ల్యూఓ, పీబీఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, సెక్రటరీల ఆదేశాల మేరకు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. మధుసూదన్‌రావుతో పాటు డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి. పవన శేషసాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వృద్ధులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులతో పాటలు పాడిస్తూ, వారితో సరదాగా గడిపి ఉత్సాహపరిచారు. వృద్ధాప్యం జీవితంలో ఎంతో ముఖ్యమైన దశ అని, ఈ సమయంలో వారు ఒంటరితనానికి గురికాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతోషంగా జీవించేలా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మధుసూదన్‌రావు సూచించారు. వృద్ధులకు ఏవైనా సమస్యలు ఎదురైనా, న్యాయపరమైన సహాయం అవసరమైనా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. న్యాయ సేవా సంస్థ తరఫున అవసరమైన న్యాయ సహాయాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం వృద్ధులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకురాలు పెరుమాళ్ల వెంకటయ్య, ఆర్డినేటర్ బి. పద్మ, వృద్ధాశ్రమంలోని వృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఉప్పల వెంకటేష్ ఆర్థిక సాయం



**కల్వకుర్తి, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గంలోని ఎల్లికల్ గ్రామానికి చెందిన ఎముకంటి జంగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతుడి కుటుంబాన్ని ఆదుకుని తక్షణ ఆర్థిక సహాయం అందించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉప్పల టీమ్ సభ్యుల ద్వారా జంగయ్య మృతి విషయం తెలుసుకున్న ఉప్పల వెంకటేష్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల టీమ్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనిల్ దాదమోని, వార్డు సభ్యుడు మద్దెల వెంకటయ్య, సెట్టిపల్లి లోకేశ్వర్, ఆరేకంటి పరమేశ్వర్, ఎముకంటి వెంకటయ్య, పబ్బతి రామస్వామి, సైదులు, అశోక్, శ్రీశైల్, సురేష్ ఎనమల్ల, మహేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అండగా బందె రాజేందర్ రెడ్డి అభిమానులు

**– జన్మదిన వేడుకల సందర్భంగా అన్నదానం, పరీక్ష సామగ్రి పంపిణీ**

**– కురుమిద్ద పాఠశాలలో బందె రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు**

**– ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ**





**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** విద్యార్థుల విద్యాభివృద్ధికి, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ పిలుపునిచ్చారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదివే తత్వం అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని కురుమిద్ద గ్రామ మాజీ వార్డు సభ్యులు బందె రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ,విద్యార్థులకు అన్నదానం చేశారు. పదో తరగతి విద్యార్థులకు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ చేతుల మీదుగా పరీక్ష ప్యాడ్లు, పరీక్షా సామగ్రి, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ఎంతో కీలకమైనవని, భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకునేలా విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. పరీక్షలను ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని, సమయపాలన పాటిస్తూ ప్రతి సబ్జెక్టుపై సమగ్ర అవగాహన పెంచుకోవాలని అన్నారు. సెల్ ఫోన్లకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. బందె రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను విద్యార్థుల మధ్య సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సునీల్ కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్యుత్ రెడ్డి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, శ్రీనివాస్, అశోక్, రాణి, వీరమణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే బందె రాజేందర్ రెడ్డి అభిమానులు పంది శ్రీను, గోపలి మహేందర్, గోపలి పవన్ కుమార్, పంది వెంకటేష్, మంద దేవిడ్, పంది అరవింద్, బాబురావు, కోటేశ్, యశ్వంత్, నాని తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత అన్నీ మాట్లాడతా



**హైదరాబాద్, ఆగస్టు 22:**: సీఎం రేవంత్ రెడ్డిపై తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలపై 2 రోజుల క్రితమే అన్నీ చెప్పానని, ఈరోజు (శుక్రవారం) చెప్పడానికి ఏమీ లేదని మంత్రి కొండా సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్? నుంచి తిరిగి వచ్చిన తర్వాత అన్ని విషయాలపై పూర్తిగా మాట్లాడతానని తెలిపారు. తన కుమార్తె వ్యాఖ్యలను మంత్రి ఖండించకపోవడాన్ని సీఎల్పీ వేదికగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విమర్శించారు. ఈ విషయం పట్ల మంత్రి కొండా సురేఖను ప్రశ్నించగా, పైవిధంగా స్పందించారు.క్రమశిక్షణ సంఘానికి లేఖ : ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమెకు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ ఎంపీ మల్లు రవికి వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని లేఖలో ఆమె కోరారు.తీవ్ర స్థాయిలో చర్చకు : మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చకు దారి తీశాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులు ఇవ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు భావిసున్నాయి.అందరి టార్గెట్ సీఎం : ఇటీవల మును గోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివా దాలు కాంగ్రెస్ పార్టీని కొంత ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అంతర్గత వ్యవహారాలను బహిరంగంగా చెప్పడం వల్ల ప్రతిపక్షాలకు ఆయుధాన్ని ఇచ్చినట్లే అవుతున్నాయి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛాయుతమైన రాజకీయ వాతావరణం ఉంటుంది. కానీ ఈ మధ్య అందరూ సీఎం రేవంత్ రెడ్డినే లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం కొంత ఇరుకున పడేస్తుంది.

# దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్ తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు




**హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌అనర్హత పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది.ఫిరాయింపు ఎమ్మెల్యేల పై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కోర్టుకు వివరించారు.పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు. తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# ప్రాణ రక్షణే లక్ష్యం.. 50 మంది వాహనదారులకు ఉచిత హెల్మెట్లు



**– పుట్టినరోజు సందర్భంగా దోర్నాల వెంకటేశ్వర్‌రెడ్డి సేవా కార్యక్రమం**
**– సీఐ జానకీరాం రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన**

**ఆమనగల్లు, ఆగస్టు 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ద్విచక్ర వాహనదారుల ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో దోర్నాల వెంకటేశ్వర్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా శనివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. తలకొండపల్లి మండలంలోని ద్విచక్ర వాహన దారులకు 50 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. సీఐ జానకీరాం రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు హెల్మెట్లు అందజేయడంతో పాటు రోడ్డు భద్రతా నిబంధనలు, హెల్మెట్ వినియోగం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహిస్తూ ప్రజల ప్రాణ రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడంపై దోర్నాల వెంకటేశ్వర్‌రెడ్డిని పలువురు అభినందించారు.

# మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో కాంక్రీట్ లోపం అన్నారం, సుందిళ్లలు ఓకే



**హైదరాబాద్, ఆగస్టు 22:** మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ నిర్మాణంలో కాం క్రీట్ నాణ్యత లోపించినట్లు తేలింది. ఈ బ్లాక్ లోని 16 నుంచి 21వ పియర్ వరకు నాణ్యతా లోపాలున్నట్లు కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ సీడబ్ల్యూపీఆర్?ఎస్ నిర్వహించిన కాంక్రీట్ క్వాలిటీ పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. 6 పియర్లలో నాణ్యత లేకపోవడం లేదా ప్రశ్నార్థకంగా ఉన్నట్లు పేర్కొంది. అన్నారంలో ఏ బ్లాక్‌లోనూ, ఏ పియర్‌లోనూ సమస్య లేదని, నాణ్యత బాగుందని స్పష్టం చేసింది. సుందిళ్ల బ్యారేజీలో కూడా కాంక్రీట్ నాణ్యత బాగుందని, ఒక బ్లాక్‌లో ఒక శాతం మాత్రమే సమస్య ఉందని పేర్కొంది.నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ పద్ధతిలో 2 పరీక్షల నిర్వహణ : కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణలో భాగంగా ఇప్పటికే పలు పరీక్షలు జరుగుతున్నాయి. బ్యారేజీల కాంక్రీట్ స్ట్రక్చర్ నాణ్యత ఎలా ఉంది? డిజైన్ ప్రకారం వరద ప్రవాహం వెళ్తుందా? లేక ఇంకేమైనా సమస్యలున్నాయా? వీటికి కాంక్రీట్ నాణ్యతకు ఉన్న సంబంధంపై అధ్యయనం జరిగింది. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ పద్ధతిలో రెండు పరీక్షలు నిర్వహించింది. అల్ట్రాసోనిక్ పల్స్ వెలాసిటీ టెస్ట్, రీబౌండ్ హ్యామర్ టెస్ట్‌ల ఆధారంగా బ్యారేజీల కాంక్రీట్ నాణ్యతపై చేసిన అధ్యయన నివేదికను సీడబ్ల్యూపీఆర్?ఎస్ ప్రధాన శాస్త్రవేత్త ఎంఎస్? హనుమంతప్ప కాళేశ్వరం చీఫ్ ఇంజినీర్‌కు పంపారు. మేడిగడ్డ బ్యారేజీ 8 బ్లాక్‌లలో 68 స్పిల్‌వే గేట్లు, 17 అండర్ స్లూయిస్ గేట్లు కలిపి 85 రేడియల్ గేట్లున్నాయి. వీటికి సంబంధించిన అన్ని పియర్స్‌పై అధ్యయనం జరిగింది.ఆరో బ్లాక్ కాంక్రీట్ నాణ్యతపై సందేహం : బ్యారేజీలో 84,800 యూపీవీ, 50,400 ఆర్‌హెచ్‌టీ నమూనాలు సేకరించి పరీక్షించారు. 8 బ్లాక్‌లకుగాను ఒకటి నుంచి ఆరు, ఎనిమిదో బ్లాక్‌లో ఎలాంటి నాణ్యతా సమస్యలు లేవని పేర్కొంది. అన్నారం, సుందిళ్లలో కొన్ని ఎక్స్‌లెంట్, గుడ్ అని పేర్కొనగా మేడిగడ్డలో మాత్రం గుడ్, సంతృప్తికరం అనే నిర్ధారణలు ఎక్కువగా ఉన్నాయి. ఆరో బ్లాక్‌లోని 33,34వ పియర్‌లో తక్కువ భాగం కాంక్రీట్ నాణ్యతపై సందేహం వ్యక్తం చేసినా 95 శాతం ఫలితాలు బాగున్నాయి కాబట్టి మొత్తమ్మీద కాంక్రీట్ నాణ్యత సంతృప్తికరమేనని పేర్కొంది. అయితే 2023లో కుంగిన ఏడో బ్లాక్‌లో మాత్రం రెండు పరీక్షల్లోనూ నాణ్యతకు సంబంధించి లోపాలు వెలుగు చూశాయి.నాణ్యతలో పూర్తిగా సందేహాలున్నట్లు పేర్కొంది. ఈ బ్లాక్‌లో మొత్తం 11 పియర్స్ ఉండగా12 నుంచి 15 వరకు, తర్వాత 22వ పియర్ బాగున్నాయి. 22వ పియర్‌లో కూడా 3.9 శాతం ఫలితాలు సందేహం, 1.9 శాతం పూర్ అని నివేదికలో పేర్కొన్నా మిగిలిన ఆరు పియర్లలో చాలా ఎక్కువగా ఉండటంతో ఇవి సమస్యగా పేర్కొంది. అత్యధికంగా నాణ్యత సందేహం, పూర్ అని పేర్కొన్న వాటిలో 19, 18, 20, 17, 21, 16వ పియర్‌లకు సంబంధించి వరుసగా 73.3శాతం, 65.5, 61.1, 50.5, 49.9, 41.3 శాతాలుగా ఉన్నాయి. వీటి పునరుద్ధరణకు సమగ్ర పరిశీలన, అనుబంధ పరీక్షలను సీడబ్ల్యూపీఆర్ ఎస్ సిఫార్సు చేసింది.అన్నారంలో ఎలాంటి సమస్యా లేదు : అన్నారం బ్యారేజీలో నూటికి నూరు శాతం ఎలాంటి నాణ్యతా సమస్యలు లేవని నివేదిక వెల్లడించింది. ఇందులో నాలుగో బ్లాక్‌లోని ఐదు పియర్స్‌లో మాత్రమే స్వల్ప సమస్యలున్నాయి. బ్లాక్‌లవారీగా చూస్తే నాలుగో బ్లాక్ కన్సాలిడేటెడ్ నివేదిక ప్రకారం 1.1 శాతం సమస్య ఉంది.ఇందులో కూడా 42వ పియర్ దిగువ భాగంలో కుడివైపు కొద్దిగా సమస్య ఉందని ఫలితాలన్నింటిలో కాంక్రీట్ నాణ్యత చాలా బాగున్నట్లు రాగా రీబౌండ్ హ్యామర్ టెస్ట్‌లలో ఓ బ్లాక్‌లో కొన్ని నమూనాల్లో తేడా వచ్చినా బ్యారేజీ మొత్తమ్మీద చూసినపుడు నాణ్యత స్థిరంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

# ఫార్మా కంపెనీలో పేలిన రియాక్టర్ - ఇద్దరు కార్మికుల మృతి - మరో 9 మందికి గాయాలు



**యాదాద్రి భువనగిరి జిల్లా :**భూదాన్ పోచంపల్లి మండల పరిధి దోతిగూడెం గ్రామంలోని హెజిలో ఫార్మా కంపెనీలో శుక్రవారం అర్ధరాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. రియాక్టర్ పేలడంతో భారీ శబ్దాలు వచ్చాయి. మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 9 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.భారీ శబ్దాలతో పేలిన రియాక్టర్ : స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, హెజిలో ఫార్మా కంపెనీలో భారీ శబ్దంతో రియాక్టర్ పేలడంతో గ్రామస్థులు భయంతో ఉలిక్కిపడ్డారు. ఇళ్ల నుంచి బయటకు వచ్చి చూసేసరికి పరిశ్రమ నుంచి భారీ ఎత్తున మంటలు ఎగిసి పడటం గమనించారు. పరిశ్రమ యాజమాన్యం అప్రమత్తం అయ్యి అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన ఘటనా స్థలంలో 10 మందికి పైగా ఉన్నారని అక్కడే పని చేసే ఇతర కార్మికులు తెలిపారు. వారిలో ఇద్దరు చనిపోగా, 9 మంది గాయాలయ్యాయని, క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారని వివరించారు. ఇదే పరిశ్రమలో 3 నెలల వ్యవధిలోనే ఇది రెండో ప్రమాదం కావడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. మృతులు, క్షతగాత్రుల వివరాలు : నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చిన్నగూడెం గ్రామానికి చెందిన చెన్ను నాగిరెడ్డి (31), ఖమ్మం జిల్లా చౌడారం గ్రామానికి చెందిన నాగనబోయిన నరేశ్ కుమార్ (29) మృతి చెందగా, రాణబోతు రాజశేఖర్ రెడ్డి (38), శ్రీహరి మేడ (27), చెన్నారెడ్డి శివకుమార్ రెడ్డి (30), మారెళ్ల యోహాన్ (26), వేదుల చెన్న కేశవులు (38) యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కంబంపాటి యేసుదాసు (25), దూడల శివశంకర్ (28), శాకేటి గణేశ్? (30), పెంట్యాల రవి(42)లకు హైదరాబాద్?లోని సన్‌షైన్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కంపెనీలను మూసేయాలి : ఇదిలా ఉండగా, హెజిలో కంపెనీ గేటు ముందు అంతమ్మ గూడెం, దోతిగూడెం గ్రామస్థులు ధర్నాకు చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస జాగ్రత్తలు తీసుకోకపోవటం వల్లే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోయారు. ఈ ప్రాంతంలో ఉన్న రసాయన పరిశ్రమలను వెంటనే మూసివేయాలని, లేకుంటే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# సహజ న్యాయసూత్రం ప్రకారం ఆ వ్యాఖ్యల్ని ఎందుకు ఖండించలేదు




**హైదరాబాద్, ఆగస్టు 22:**
కాంగ్రెస్ ప్రభుత్వం అందరినీ సమానంగా చూస్తోందని బీసీలను ఒకలా, రెడ్డిలను మరోలా చూడట్లేదని తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. (శనివారం) ఏబీఎన్‌తో మాట్లాడిన ఆయన. కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందిం చారు. కొండా సుస్మిత వ్యవహారంపై అధి ష్ఠానం స్పందించిందని, ఈ మేరకు మం త్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. దీనిపై మంత్రి సురేఖ వాట్సాప్‌లో వివరణ లేఖను పంపినట్టు తెలిపారు. అయితే.. ఈ లేఖపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో పార్టీ పెద్దలు చర్చిస్తున్నారని చెప్పారు.సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని పేర్కొన్న కొండా సురేఖ వివరణను మల్లు రవి వ్యతిరేకించారు. 'పార్టీకి వ్యతిరేకంగా ఒకరు మాట్లాడుతుంటే దేవదాయశాఖ మంత్రి హోదాలో ఉన్న కొండా సురేఖ ఎందుకు స్పందించలేదు? పార్టీ సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఖండించాల్సింది. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నప్పుడు మౌనంగా ఎందుకు ఉన్నారు?' అని ప్రశ్నించారు. కాగా.. గతంలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.అలాగే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన అంశంపై కూడా మల్లు రవి స్పందించారు. ఈ విషయంపై ఇప్పటివరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదని, సమయం వచ్చినప్పుడు ఆ అంశాన్ని సుమోటోగా స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

# వేలేరు మండలానికి సాగునీరు అందించాలని ఎమ్మెల్యే శ్రీహరికి వినతి



**వేలేరు:** వరంగల్ జిల్లా వేలేరు మండలంలోని రైతులకు సాగునీరుఅందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకులు, రైతులు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి శనివారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని సాగు భూములకు గోదావరి జలాలు అందేలా పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను వేగవంతం చేయాలని కోరారు. వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారం కోసం ఎత్తిపోతల పథకాలు, పైప్‌లైన్, కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వేలేరు మండలానికి గండి రామారం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు అందించి రెండు పంటలకు సాగునీరు కల్పిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇచ్చిన హామీని గుర్తు చేశారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారావు, సర్పంచ్ మరిజె అనిత, నాయకులు విజేందర్ రెడ్డి, జానీ, హరీఫ్ పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌ను కలిసిన ఆక్స్‌ఫర్డ్ ప్రొఫెసర్.



**హైదరాబాద్, ఆగస్టు 22:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన యూకే పర్యటనలో భాగంగా ఆక్స్‌ఫర్డ్ యూని వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్‌తో సమావేశం కావడం రాజకీయంగా తీవ్ర చర్చనీ యాంశమైంది. పరిపాలన, ప్రభుత్వ విధానా లపై చర్చించేందుకు నిన్న జరిగిన ఈ భేటీపై బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. మాయా ట్యూడర్ ఒక 'భారత వ్యతిరేకి' అని, అలాంటి వ్యక్తితో సీఎం భేటీ కావడం సరికాదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు ఎవరీ మాయా ట్యూడర్? ఆమె నేపథ్యం ఏమిటి? ఈ వివాదానికి కారణమేంటి? అనే విషయాలు ఆసక్తికరంగా మారాయి.ఎవరీ మాయా ట్యూడర్?మాయా ట్యూడర్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని ప్రతిష్ఠాత్మక బ్లావత్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో పాలిటిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె సెయింట్ హిల్డాస్ కాలేజీలో ఫెలోగా కూడా ఉన్నారు. ప్రధానంగా దక్షిణాసియాలో ప్రజాస్వామ్య, సమర్థవంతమైన రాజ్యాల ఆవిర్భావంపై ఆమె పరిశోధనలు కేంద్రీకృతమై ఉంటాయి. ప్రజాస్వామ్యాలు ఎలా ఏర్పడతాయి, ఎలా నిలదొక్కుకుంటాయి, జాతీయవాదానికి-ప్రజాస్వామ్యానికి మధ్య ఉన్న సంబంధం, అధికారంలో ఉన్న బలమైన పార్టీలు ఎలా అధికారం కోల్పోతాయి వంటి అంశాలపై ఆమె విస్తృతంగా అధ్యయనం చేశారు.వివాదానికి కారణమైన వ్యాసాలు, రచనలు2013లో మాయా ట్యూడర్ 'ది ప్రామిస్ ఆఫ్ పవర్: ది ఆరిజిన్స్ ఆఫ్ డెమోక్రసీ ఇన్ ఇండియా అండ్ ఆటోక్రసీ ఇన్ పాకిస్థాన్' అనే పుస్తకాన్ని రచించారు. నిరంకుశ పాలన వైపు వెళ్లిందనే అంశాలను ఈ పుస్తకంలో ఆమె విశ్లేషించారు. భారతదేశంలోని సమ్మిళిత జాతీ యవాద ఉద్యమమే ఇందుకు ఒక కారణమని ఆమె పేర్కొన్నారు.అయితే, 2023లో ఆమె 'జర్నల్ ఆఫ్ డెమోక్రసీ'లో రాసిన 'వై ఇండియా స్ డెమోక్రసీ ఈజ్ డయింగ్' అనే వ్యాసం తీవ్ర వివాదాస్పదమైంది. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో దేశంలో ప్రజాస్వామ్యం క్షీణిస్తోంది ని ఆమె ఆ వ్యాసంలో విశ్లేషించారు. సరిగ్గా ఈ వ్యాసాన్నే బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. భారత వ్యతిరేక రచనలు చేసే వ్యక్తితో ముఖ్యమంత్రి సమావేశం కావడం రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని ఆయన ఆరోపించారు.ప్రభుత్వ వాదన ఇదే..మరోవైపు, మాయా ట్యూడర్ పరిశోధన కేవలం భారతదేశానికే పరిమితం కాదు. ఆమె వివిధ దేశాల రాజకీయ వ్యవస్థలు, జాతీయవాదంపై కూడా అధ్యయనాలు చేశారు. బీజేపీ విమర్శ లపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో సహకారాన్ని అన్వేషించే ప్రయత్నాల్లో భాగంగానే ఈ సమావేశం జరిగిందని స్పష్టం చేసింది. ఒక విద్యావేత్తతో జరిగిన సమావేశాన్ని రాజకీయ కోణంలో చూడటం సరికాదని పరోక్షంగా సూచించింది.